# తీన్మార్

teenmaardesk@gmail.com
RNI no TELTEL/2021/86151

నేటి వాస్తవాలు... తెలుగు దిన పత్రిక

ములుగు | సంపుటి: 04 | సంచిక: 276 | చీఫ్ ఎడిటర్ : రెడ్డి శేఖర్ | పేజీలు : 8 | ఆదివారం 12 ఏప్రిల్ 2026 | వెల : 5-00

Published rom Mulugu Circulated by Warangal, Khammam, Hyderabad, Nalgonda, Mahabubnagar, Rangareddy,Medak, Karimnagar, Nizamabad, Adilabad


## నేడే తెలంగాణ ఇంటర్ ఫలితాలు

ఉదయం 11 గంటలకు విడుదల



2



## పాతబస్తీ మెట్రోకు గ్రీన్ సిగ్నల్


**84 భారీ చెట్ల తరలింపునకు టెండర్లు**

**15.64 లక్షలతో చెట్ల ట్రాన్స్‌లొకేషన్**

హైదరాబాద్, ఏప్రిల్ 11 (తీన్మార్ న్యూస్):

పాతబస్తీ మెట్రో ప్రాజెక్టులో కీలకమైన ముందడుగు పడింది. ఎంజీబీఎస్–దారుల్షిఫా నుంచి ఫలక్‌నుమా వరకు సాగే మెట్రో అలైన్‌మెంట్‌లో ఉన్న ప్రధాన ఆటంకాలను తొలగించేందుకు హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ మెట్రో లిమిటెడ్ చర్యలు చేపట్టింది. ఈ మార్గంలో అడ్డుగా ఉన్న 84 భారీ చెట్లను నరికివేయకుండా మరో చోటికి తరలించాలని (ట్రాన్స్‌లొకేషన్) అధికారులు నిర్ణయించారు. ఇందుకు సంబంధించి తాజాగా టెండర్లను ఆహ్వానించారు. ఈ ప్రాజెక్టు అంచనా వ్యయం రూ. 15.64 లక్షలుగా - మిగతా 2లో

## టీజీ టెట్ నోటిఫికేషన్‌కు విద్యాశాఖ కసరత్తు



- లక్షలాది మంది అభ్యర్థుల నిరీక్షణకు తెర
- ఈనెల 13న నోటిఫికేషన్ విడుదల

తెలంగాణ బ్యూరో, ఏప్రిల్ 11 (తీన్మార్ న్యూస్):

తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టీజీటెట్) నిర్వహణకు రెడీ అయింది. ఈ మేరకు ఈనెల 13వ తేదీన టెట్ నోటిఫికేషన్ విడుదల చేసేందుకు విద్యాశాఖ కసరత్తు చేస్తోంది. జూన్ రెండో వారంలో పరీక్షలు నిర్వహించేలా అధికారులు ప్రాథమికంగా షెడ్యూల్ రూపొందించారు. ప్రతీయేటా రెండు సార్లు టెట్ నిర్వహిస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ హామీ మేరకు యేటా రెండు సార్లు టెట్ పరీక్షను నిర్వహిస్తుంది. దీంట్లో భాగంగానే జనవరిలో పరీక్ష పూర్తికాగా.. తాజాగా రెండో నోటిఫికేషన్ - మిగతా 2లో



## మూసీ పునరుద్ధరణ చేయండి

- కానీ పేదల ఇళ్లు కూల్చొద్దు:కిషన్ రెడ్డి
- కాంగ్రెస్ చేస్తే ఒప్పు.. బీజేపీ చేస్తే తప్పా..?
- దిశా సమావేశంలో కిషన్ రెడ్డి ధ్వజం

2



## ముల్లన్ పూర్‌లో పంజాబ్ పంజా

- సన్‌రైజర్స్‌పై ఘనవిజయం
- 220 పరుగుల భారీ లక్ష్యం ఈజీగా ఛేజ్
- దంచికొట్టిన అభిషేక్ శర్మ వృథా

2



2

## మా సమస్యలు పరిష్కరించండి

- చెవిలో పువ్వులతో విద్యుత్ ఆర్టిజన్ల వినూత్న నిరసన
- సర్కారు తీరుపై కార్మికుల ఆగ్రహం

## జీహెచ్ఎంసీలో భారీ అవినీతి



- రూ.1,148 కోట్ల పనులు నామినేషన్ పద్ధతిలో కట్టబెట్టారు
- కమీషన్ల కోసమే ఫ్యూచర్ సిటీ, కాళేశ్వరం రిపేర్లు
- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత ధ్వజం

హైదరాబాద్, ఏప్రిల్ 11 (తీన్మార్ న్యూస్):

జీహెచ్ఎంసీలో కాంగ్రెస్ ప్రభుత్వం అవినీతికి పాల్పడుతున్నదని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత ఆరోపించారు. హైదరాబాద్ అభివృద్ధి కోసం అంటూ హెచ్ఎండీఏ పరిధిలో ఉన్న రూ.35 వేల కోట్ల విలువైన ప్లాట్లను అమ్మేశారని, ఆ డబ్బులు హైదరాబాద్ నగర అభివృద్ధికి ఏ మాత్రం ఉపయోగపడలేదన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని జాగృతి - మిగతా 2లో

## హర్మూజ్ జలసంధిని దాటిన జగ్ విక్రమ్

కాల్పుల విరమణ తర్వాత భారత్‌కు తొలి గ్యాస్ ట్యాంకర్

2



## ఆరు గ్యారంటీల పేరిట అడ్డగోలు మోసం

- అభివృద్ధి శూన్యం.. ఢిల్లీ పర్యటనలే ముఖ్యం
- కాంగ్రెస్ పాలనపై కేటీఆర్ నిప్పులు

ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 11 (తీన్మార్ న్యూస్):

తెలంగాణ రాష్ట్రంలో ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజలకు మంచి పాలన అందించాల్సిన ఆవశ్యకత ఉందని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కల్వకుంట్ల తారక రామారావు అన్నారు. శనివారం ఇబ్రహీంపట్నంలో నూతనంగా ఎన్నికైన సర్పంచులు, కౌన్సిలర్లకు నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వంపై కేటీఆర్ నిప్పులు చెరిగారు. ఆరు గ్యారంటీల పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్, వాటిని అమలు - మిగతా 2లో



## ఏది పడితే అది మాట్లాడితే ఊరుకోం



- ప్రతిపక్షాలకు మంత్రి సీతక్క వార్నింగ్
- మీ ఆరోపణలు నిరూపించండంటూ సవాల్

ములుగు, ఏప్రిల్ 11 (తీన్మార్ న్యూస్):

ఇష్టానుసారంగా ఆరోపణలు చేసే ప్రతిపక్షాలకు మంత్రి సీతక్క వార్నింగ్ ఇచ్చారు. ఏది పడితే అది మాట్లాడితే ఊరుకోం.. చట్టపరమైన చర్యలు తప్పవు. దమ్ముంటే మీ ఆరోపణలు నిరూపించండంటూ సవాల్ విసిరారు. ములుగులో పోషణ పక్వాడ సందడి కార్యక్రమాన్ని ప్రారంభించారు మంత్రి సీతక్క. ఈ సందర్భంగా గత ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టారు. గత ప్రభుత్వ హయాంలో అంగన్‌వాడీల పరిస్థితి అత్యంత దయనీయమన్నారు - మిగతా 2లో



## బిల్లు కట్టకపోతే కనెక్షన్ కట్

- సైబర్ నేరగాళ్ల సరికొత్త ఎత్తుగడపై జాగ్రత్త
- నగరవాసులను అప్రమత్తం చేసిన సీపీ సజ్జనార్

2

## పార్లమెంట్ వేదికగా అగ్రనేతల అరుదైన కలయిక



- మోదీ– రాహుల్ స్నేహపూర్వక భేటీ
- పూలే జయంతి వేళ.. రాజకీయ ప్రత్యర్థుల స్నేహహస్తం

న్యూ ఢిల్లీ, ఏప్రిల్ 11 (తీన్మార్ న్యూస్):

రాజకీయాల్లో బద్ధశత్రువులుగా కనిపించే ప్రధాని నరేంద్ర మోడీ, లోక్‌సభ ప్రతిపక్ష నేత - మిగతా 2లో

# బిల్లు కట్టకపోతే కనెక్షన్ కట్

హైదరాబాద్, ఏప్రిల్ 11 (తీన్మార్ న్యూస్):



సైబర్ నేరగాళ్లు అమాయక ప్రజలను దోచుకోవడానికి సరికొత్త ఎత్తుగడలు వేస్తున్నారు. ప్రస్తుతం హైదరాబాద్ నగరంలో 'వాటర్ బిల్లు బకాయి' పేరుతో జరుగుతున్న మోసాలపై హైదరాబాద్ సీపీ వీసీ సజ్జనార్ నగరవాసులను అప్రమత్తం చేశారు. ప్రజల భయాన్ని ఆసరాగా చేసుకుని, నీటి కనెక్షన్ కట్ చేస్తామంటూ బెదిరింపులకు పాల్పడుతూ సైబర్ దొంగలు అకౌంట్లు ఖాళీ చేస్తున్నారని ఆయన వెల్లడించారు. టెక్నాలజీ పెరుగుతున్న కొద్దీ నేరగాళ్లు కూడా కొత్త రూపాల్లో దాడి చేస్తున్నారని, ఇలాంటి తరుణంలో అప్రమత్తత ఒక్కటే మార్గమని సీపీ స్పష్టం చేశారు. ఈ మోసంలో నేరగాళ్లు ముందుగా ఫోన్ కాల్ లేదా మెసేజ్ చేసి, చాలా కాలంగా నీటి బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని నమ్మిస్తారు. వెంటనే చెల్లించకపోతే కనెక్షన్ కట్ చేస్తామని ఒత్తిడి పెంచుతారు. ఆపై బకాయిలు చెల్లించడానికి లేదా వివరాలు అప్‌డేట్ చేయడానికి 'సవీఔాదీ ఔాుజు= దీ×ూూ ఖూణాూుజు.ఖజూని' వంటి అనుమానాస్పద లింకులను పంపిస్తారు. ఆ ఫైల్‌ను డౌన్‌లోడ్ చేసి ఇన్‌స్టాల్ చేయగానే, బాధితుల ఫోన్ మొత్తం నేరగాళ్ల నియంత్రణలోకి వెళ్తుంది. దీనివల్ల ఫోన్‌లోని మెసేజ్‌లు, ఓటీపీలు (గ్రూం), వ్యక్తిగత సమాచారం వారికి సులువుగా చేరిపోతాయని సీపీ వివరించారు. గుర్తుతెలియని వ్యక్తులు పంపే ఏపీకే ఫైళ్లను పొరపాటున కూడా ఇన్‌స్టాల్ చేయవద్దని అధికారులు హెచ్చరిస్తున్నారు. నీటి బిల్లులు చెల్లించాలనుకుంటే కేవలం అధికారిక వెబ్‌సైట్ లేదా అధికారిక మొబైల్ యాప్‌ల ద్వారానే లావాదేవీలు నిర్వహించాలి. ఒకవేళ పొరపాటున ఎవరైనా ఇలాంటి ఉచ్చులో చిక్కుకొని డబ్బులు కోల్పోతే, ఏమాత్రం ఆలస్యం చేయకుండా 1930 హెల్ప్‌లైన్ నంబర్‌కు కాల్ చేయాలి లేదా ఛఎఎవతీఛతీఱఎవ.స్ర్తశీజ.ఱఅ పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలి. తక్షణమే స్పందించడం ద్వారా పోగొట్టుకున్న డబ్బును రికవరీ చేసే అవకాశం ఉంటుందని సీపీ సజ్జనార్ సూచించారు.

## ఆరు గ్యారంటీల పేరిట అడ్డగోలు మోసం

-మొదటిపేజీ తరువాయి

చేయడంలో పూర్తిగా విఫలమైందని కేటీఆర్ ఆరోపించారు. రైతులకు రుణమాఫీ చేస్తామని చెప్పి ఇప్పటికీ డబ్బులు ఇవ్వలేదు. మహిళలకు నెలకు రూ.2,500, స్కూటీలు ఇస్తామని చెప్పి ఓట్లు వేయించుకుని ఇప్పుడు వారిని మోసం చేశారు. చివరకు వృద్ధులకు రెండు నెలల పింఛను కూడా ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారు అని ఆయన విమర్శించారు. యువతను ఊరించి అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డి సర్కార్, గత రెండున్నరేళ్లలో (28 నెలలు) కనీసం 11 వేల ఉద్యోగాలు కూడా ఇవ్వలేకపోయిందని కేటీఆర్ ఎద్దేవా చేశారు. 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామన్న హామీ ఎక్కడకు పోయిందని ఆయన ప్రశ్నించారు. గడిచిన కాలంలో తెలంగాణలో కాంగ్రెస్ చేసిన అభివృద్ధి శూన్యమని మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాటిమాటికీ ఢిల్లీకి ఎందుకు వెళ్తున్నారో ప్రజలందరికీ తెలుసని కేటీఆర్ వ్యాఖ్యానించారు. రాష్ట్ర పరిపాలనను గాలికొదిలేసి ఢిల్లీ చుట్టూ తిరుగుతున్నారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వ అరాచకాలు అన్నీ ఇన్నీ కావు. కానీ ప్రజలు అన్నీ గమనిస్తున్నారు. రానున్న ఎన్నికల్లో అధికారంలోకి వచ్చేది మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వమే అని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీఆర్ఎస్ నాయకులు, భారీ సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

# హర్మూజ్ జలసంధిని దాటిన జగ్ విక్రమ్

న్యూ ఢిల్లీ, ఏప్రిల్ 11 (తీన్మార్ న్యూస్):

గల్ఫ్ ప్రాంతంలో నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో భారత ఇంధన అవసరాలకు సంబంధించి ఒక కీలక పరిణామం చోటుచేసుకుంది. భారీ ఎల్పీజీ లోడ్‌తో భారత్‌కు బయల్దేరిన జగ్ విక్రమ్ నౌక అత్యంత కీలకమైన హర్మూజ్ జలసంధిని సురక్షితంగా దాటింది. అమెరికా– ఇరాన్ దేశాల మధ్య కాల్పుల విరమణ ప్రకటించిన తర్వాత హర్మూజ్ జలసంధిని దాటిన మొట్టమొదటి నౌకగా 'జగ్ విక్రమ్' రికార్డు సృష్టించింది. శుక్రవారం అర్ధరాత్రి దాటాక జలసంధిని దాటిన ఈ నౌక, శనివారం మధ్యాహ్నానికి గల్ఫ్ ఆఫ్ ఒమన్‌లోకి ప్రవేశించింది. ముంబయికి చెందిన గ్రేట్ ఈస్టర్న్ షిప్పింగ్ కంపెనీకి చెందిన ఈ గ్యాస్ ట్యాంకర్, సుమారు 20,000 టన్నుల ఎల్పీజీని భారత్‌కు తీసుకువస్తోంది. షిప్పింగ్ డేటా నివేదికల ప్రకారం జలసంధిని దాటడానికి అనుమతి కోసం జగ్ విక్రమ్ వారం రోజులకు పైగా గల్ఫ్ జలాల్లోనే వేచి చూడాల్సి వచ్చింది. భద్రతా కారణాలు మరియు అంతర్జాతీయ ఉద్రిక్తతల దృష్ట్యా ఈ ఆలస్యం జరిగినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఈ నౌక సురక్షిత ప్రాంతంలోకి రావడంతో మరికొద్ది రోజుల్లోనే భారత తీరానికి చేరుకోనుంది.

# ముల్లన్ పూర్‌లో పంజాబ్ పంజా

హైదరాబాద్, ఏప్రిల్ 11 (తీన్మార్ న్యూస్):



ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2026లో భాగంగా ముల్లన్ పూర్ వేదికగా సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్ఆర్‌హెచ్)తో జరిగిన మ్యాచ్‌లో పంజాబ్ కింగ్స్ (పీబీకేఎస్) అద్భుత విజయం సాధించింది. ఎస్ఆర్‌హెచ్ నిర్దేశించిన 220 పరుగుల లక్ష్యాన్ని పీబీకేఎస్ మరో 7 బంతులు ఉండగానే 4 వికెట్స్ మాత్రమే కోల్పోయి ఛేదించింది. కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్ (69 నాటౌట్), ఓపెనర్ ప్రియాంశ్ ఆర్య (57) సునామీ ఇన్నింగ్స్‌లు ఆడడంతో పంజాబ్ సునాయాస విజయంను ఆడుకుంది. సన్‌రైజర్స్ బౌలర్లలో శివాంగ్ కుమార్ మూడు వికెట్స్ పడగొట్టాడు. భారీ ఛేదనలో పంజాబ్ జట్టుకు అద్భుత ఆరంభం దక్కింది. ఓపెనర్లు ప్రభ్‌సిమ్రన్ సింగ్, ప్రియాంశ్ ఆర్యలు దంచి కొట్టారు. ఏ బౌలర్ వేసినా బౌండరీలు, సిక్సులు బాదుతూ స్కోర్ బోర్డును పరుగులు పెట్టించారు. దాంతో 6 ఓవర్లకు స్కోర్ 93 రన్స్ చేసింది. 16 బంతుల్లో ప్రియాంశ్ హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. శివాంగ్ కుమార్ బౌలింగ్‌లో (6.2) ప్రియాంశ్ అవుట్ అయ్యాడు. 24 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్న ప్రభ్‌సిమ్రన్‌ను శివాంగ్ పెవిలియన్ చేర్చాడు. కూపర్ (11) నిరాశపర్చినా.. శ్రేయాస్ అయ్యర్ రెచ్చిపోయాడు. 24 బంతుల్లో హాఫ్‌సెంచరీ పూర్తి చేసుకున్న శ్రేయస్.. శశాంక్ సింగ్ (16) అండతో జట్టుకు విజయాన్ని అందించాడు. లక్ష్యాన్ని పంజాబ్ 18.5 ఓవర్లలోనే ఛేదించింది. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన సన్‌రైజర్స్ హైదరాబాద్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 219 రన్స్ చేసింది. ఓపెనర్ అభిషేక్ శర్మ 28 బంతుల్లో 5 ఫోర్లు, 8 సిక్స్‌లతో 74 రన్స్ చేశాడు. ట్రావిస్ హెడ్ 23 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్‌తో 38 పరుగులు చేశాడు. ఓపెనర్ల ధాటికి ఎస్ఆర్‌హెచ్ 8 ఓవర్లకే 120 పరుగులు చేసింది. ఒకే ఓవర్‌లో అభిషేక్, హెడ్ పెవిలియన్ చేరడంతో సన్‌రైజర్స్ స్కోర్ వేగం తగ్గింది. ఇషాన్ కిషన్ (27), హెన్రిచ్ క్లాసెన్ (39), అనికేత్ వర్మ (18) రన్స్ చేశారు. ఇన్నింగ్స్ చివరలో పంజాబ్ బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేశారు. దీంతో 250కి పైగా వెళ్లాల్సిన స్కోరు 220కే పరిమితమైంది. పంజాబ్ బౌలర్లలో అర్షదీప్ సింగ్, శశాంక్ సింగ్ 2 వికెట్లు తీయగా.. బార్ట్‌లెట్ ఒక వికెట్ పడగొట్టాడు.

# టీజీ టెట్ నోటిఫికేషన్‌కు విద్యాశాఖ కసరత్తు

-మొదటిపేజీ తరువాయి




ఇచ్చేందుకు సర్కారు గ్రీన్ సిగ్నలిచ్చింది. ఈ సందర్భంగా శుక్రవారం నోటిఫికేషన్ విడుదల, దరఖాస్తుల స్వీకరణ, పరీక్ష తేదీలపై చర్చించారు. ఈనెల 13వ తేదీన టీజీ టెట్ నోటిఫికేషన్ ఇచ్చేందుకు నిర్ణయించారు. ఒకవేళ 13వ నోటిఫికేషన్ వెలువడకుంటే ఈనెలాఖరులోగా టెట్ నోటిఫికేషన్ విడుదల చేసేందుకు విద్యాశాఖ సన్నద్ధమవుతోంది. జూన్ రెండో వారంలో పరీక్షలు నిర్వహించేలా ప్లాన్ చేస్తున్నారు. ఈ ఏడాది జనవరి 3 నుంచి 20వ తేదీ వరకు జరిగిన టెట్ పరీక్షలకు మొత్తం 1.95లక్షల మంది అభ్యర్థులు హాజరయ్యారు. వీరిలో లక్ష మంది (51.37శాతం) అర్హత సాధించారు. మరోవైపు.. సుప్రీంకోర్టు తీర్పుతో టీచర్లకు టెట్ తప్పనిసరి అయింది. దీంతో జనవరిలో జరిగిన టెట్ పరీక్షకు 67,605 మంది ఇన్ సర్వీస్ టీచర్లు హాజరుకాగా.. వారిలో 37.893 మంది (57.76శాతం) క్వాలిఫై అయ్యారు. దీంతో మరో 30వేల మంది మాత్రమే టెట్ క్వాలిఫై కావాల్సి ఉంది. వారందరికీ మరో మూడు టెట్ పరీక్షలు రాసేందుకు అవకాశం ఉంది. ఈసారి టీచర్లు తమ సత్తా చాటేందుకు రెడీ అవుతున్నారు. టెట్ పరీక్షలో ఒక్కసారి అర్హత సాధిస్తే డీఎస్సీ రాసేందుకు జీవిత కాలం వ్యాలిడిటీ ఉంటుంది. బీఎడ్, డీఎడ్ అర్హత కలిగిన అభ్యర్థులు ఎన్నిసార్లు అయినా టెట్ రాయవచ్చు. టెట్‌లో ఎక్కువ స్కోర్ సాధించిన వారికి డీఎస్సీలో వెయిటేజ్ మార్కులు కలుస్తాయి. టెట్ పరీక్ష మొత్తం 150 మార్కులకు ఆన్‌లైన్ విధానంలో ఉంటుంది. ఇక ఈ పరీక్షలో ఓసీ అభ్యర్థులు 60 శాతం మార్కులు సాధించాల్సి ఉంటుంది. ఇక బీసీ అభ్యర్థులు 50 శాతం, ఎస్టీ, ఎస్సీ, పీహెచ్, ఎక్స్ సర్వీస్ మెన్ 40 శాతం అర్హత మార్కులు సాధించాల్సి ఉంటుంది.

## జీహెచ్ఎంసీలో కాంగ్రెస్ భారీ అవినీతి

-మొదటిపేజీ తరువాయి



ఆఫీసులో కవిత మీడియాతో మాట్లాడారు. గ్రామాల్లో ఏదైనా పని చేయాలంటే?రూ.5 లక్షలు దాటిన వర్క్స్?కు టెండర్?ను పిలుస్తారని, కానీ, హెచ్?ఎండీఏ పరిధిలో మాత్రం నామినేషన్ ?రూపంలో కట్టబెట్టేస్తున్నారని మండిపడ్డారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం నుంచే ఈ పద్ధతి కొనసాగుతున్నదని తెలిపారు. 2017 నుంచి బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ విధంగా రూ.480 కోట్లు కాంట్రాక్టర్లకు ఇచ్చిందని, ఇప్పుడు కాంగ్రెస్? ప్రభుత్వం రూ.1,148 కోట్ల విలువైన పనులను నామినేషన్ పద్ధతిలో కాంట్రాక్టర్లకు అప్పగించిందని ఆరోపించారు. నామినేషన్ల పద్ధతిలో కాంట్రాక్ట్ లు ఇవ్వవద్దని 2023లోనే వేసిన కమిటీ స్పష్టం చేసిందని గుర్తు చేశారు. ఓఆర్?ఆర్? మెయింటెనెన్స్?ఖర్చు మొత్తం ప్రభుత్వమే పెడుతున్నదని ఆరోపించారు. అవినీతిని ఇంకా పెంచుకోవటానికి ఫ్యూచర్ సిటీని ముందుకు పెడుతున్నారని ఆరోపించారు. కమీషన్ల కోసమే కాళేశ్వరం ప్రాజెక్టుకు రిపేర్లంటున్నారని కవిత విమర్శించారు. కాళేశ్వరం ఫెయిల్ అయ్యిందని చెప్పేందుకు ఎనిమిదిన్నర లక్షల ఎకరాలను ఎండబెట్టిన కర్కోటక ప్రభుత్వమని మండిపడ్డారు. ఎంపీ అర్వింద్ కు తెలివిలేదని, ఏం మాట్లాడుతాడో ఆయనకే తెలియదన్నారు. తన లాంటి వాళ్లను ఎవరో మద్దతిస్తే బతుకుతానని అర్వింద్? చెప్పడం పురుషాహంకారానికి నిదర్శనమన్నారు. మరోసారి అలా మాట్లాడితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. జాగృతి పార్టీ ఏర్పాటు కార్యక్రమాన్ని పర్యవేక్షించేందుకు 21 కమిటీలు వేశామన్నారు. ప్రతి కమిటీలో 30 మంది సభ్యులు, 500 మంది వలంటీర్లు ఉంటారని తెలిపారు.


## మూసీ పునరుద్ధరణ చేయండి

హైదరాబాద్, ఏప్రిల్ 11 (తీన్మార్ న్యూస్):

పేదల ఇండ్లు కూల్చకుండా మూసీ పునరుద్ధరణ పనులు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సూచించారు. జూబ్లీహిల్స్ –మర్రి చెన్నారెడ్డి హ్యూమన్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్‌లో జరిగిన దిశా సమావేశం అనంతరం మీడియాతో కిషన్ రెడ్డి మాట్లాడారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి పేరుతో ప్రజలను భయాందోళనకు గురిచేయొద్దన్నారు. మూసీ పునరుద్ధరణకు బీజేపీ వ్యతిరేకం కాదని, కానీ పేద ప్రజలకు అన్యాయం జరిగితే వారికి అండగా ఉంటామని స్పష్టం చేశారు. గతంలో నియోజకవర్గాల పునర్విభజన కాంగ్రెస్ ప్రభుత్వంలో జరగలేదా.. కాంగ్రెస్ హయాంలో సర్ ప్రక్రియ చేయలేదా.. ఇప్పుడెందుకు కాంగ్రెస్ నాయకులు రాద్ధాంతం చేస్తున్నారని ఆయన ప్రశ్నించారు. నియోజకవర్గాల పునర్విభజన మీద కాంగ్రెస్ నాయకులు సలహాలు, సూచనలు కమిటీకి ఇవ్వాలని, అభ్యంతరాలు ఉంటే చెప్పాలని కోరారు. కానీ కాంగ్రెస్ చేస్తే ఒప్పు, బీజేపీ చేస్తే తప్పు అనేలా ప్రవర్తించవద్దన్నారు. జీఎస్టీ తెస్తే తప్పుడు ప్రచారం చేశారని, కొవిడ్ వ్యాక్సిన్ తీసుకువస్తే మోదీ వ్యాక్సిన్ అని విమర్శించారని గుర్తుచేశారు. ఆపరేషన్ సిందూర్‌లో భారత్ ఓడిపోయిందని కాంగ్రెస్ అనడం శోచనీయమన్నారు. సర్జికల్ స్ట్రైక్స్‌కు ఆధారాలు అడిగి సైనికుల ఆత్మస్థైర్యం దెబ్బతినేలా ఆ పార్టీ నాయకులు మాట్లాడటం సరికాదన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఇచ్చిన అన్ని హామీలు, గ్యారంటీలను అమలు చేస్తోందని తెలిపారు.

## పార్లమెంట్ వేదికగా అగ్రనేతల అరుదైన కలయిక

-మొదటిపేజీ తరువాయి



రాహుల్ గాంధీ మధ్య పార్లమెంట్ వేదికగా ఒక ఆసక్తికర సన్నివేశం చోటుచేసుకుంది. వీరిద్దరూ ఒకరినొకరు పలకరించుకోవడమే కాకుండా, కాసేపు యోగక్షేమాలు చర్చించుకోవడం ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. మహాత్మా జ్యోతిబా పూలే 200వ జయంతిని పురస్కరించుకుని శనివారం పార్లమెంట్ ప్రాంగణంలోని 'ప్రేరణ స్థల్' వద్ద ఘన నివాళులు అర్పించారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉపాధ్యక్షుడు సీపీ రాధాకృష్ణన్‌తో కలిసి ప్రధాని మోడీ, స్పీకర్ ఓం బిర్లా, రాహుల్ గాంధీ తదితరులు పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రధాని మోడీ కార్యక్రమానికి చేరుకోగానే, అక్కడ వేచి ఉన్న రాహుల్ గాంధీకి నమస్కరించారు. అనంతరం ఇరువురు నేతలు పక్కపక్కనే నడుస్తూ చాలా సేపు మాట్లాడుకున్నారు. ప్రధాని ఏదో చెబుతుండగా రాహుల్ గాంధీ తల ఊపుతూ వింటున్న దృశ్యాలు కెమెరాకు చిక్కాయి. వీరిద్దరూ పరస్పరం కుశల ప్రశ్నలు వేసుకున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఐదు రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికల వేడి కొనసాగుతోంది. బీజేపీ, కాంగ్రెస్ నేతలు ఒకరిపై ఒకరు తీవ్ర విమర్శలు చేసుకుంటున్నారు. అటు పార్లమెంట్‌లోనూ ఇరు వర్గాల మధ్య పోరు తారాస్థాయిలో ఉంది. ఇలాంటి ఉత్కంఠభరిత రాజకీయ వాతావరణంలో, దేశంలోని అగ్రనేతలు ఇలా సౌహార్ద్రపూర్వకంగా పలకరించుకోవడం అందరి దృష్టిని ఆకర్షించింది. ఇందుకు సంబంధించిన వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

# మా సమస్యలు పరిష్కరించండి

జహీరాబాద్, ఏప్రిల్ 11 (తీన్మార్ న్యూస్):



తమ సమస్యలు పరిష్కరించాలని విద్యుత్ శాఖలో పనిచేస్తున్నఆర్టిజన్ కార్మికులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నిరవధిక సమ్మెలో భాగంగా శనివారం జహీరాబాద్ పట్టణంలోని విద్యుత్ శాఖ కార్యాలయ ఆర్టిజన్ కార్మికులు చెవిలో పువ్వులు పెట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు ఆర్టిజన్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు, కార్మికులు మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే విద్యుత్ శాఖలో పనిచేస్తున్న ఆర్టిజన్ కార్మికుల సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చి రెండేళ్లు గడిచినా పట్టించుకోవడంలేదని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం విద్యుత్ సంస్థలో ఆర్టిజన్‌లుగా పనిచేస్తున్నవారి విద్యార్హతలను బట్టి వారికి కన్వెర్షన్ ఇవ్వాలని పేర్కొన్నారు. కొన్ని సంవత్సరాలుగా చాలీచాలని వేతనాలతో పనిచేస్తూ ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం వారికి ప్రత్యేక పీఆర్సీ ప్రకటించాలని డిమాండ్ చేశారు. కన్వెర్షన్ ఇవ్వాలని , ఏపీఎస్ఈవీ రూల్స్ ఇవ్వాలని కోరారు. గత ప్రభుత్వం కాంట్రాక్టు కార్మికులను ఆర్టిజన్‌లుగా విభజించారని, దీని వల్ల ఆర్టిజన్‌లు చాలా వరకు నష్టపోతున్నారన్నారు. సమస్యలు పరిష్కరించేంత వరకు సమ్మెను కొనసాగిస్తామన్నారు. ఆర్టిజన్ కార్మికుల సమస్యలు పరిష్కరిస్తామని చెప్పి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ప్రభుత్వం మాకు చెవిలో పువ్వు పెట్టిందని.. అందుకు చెవిలో పువ్వు పెట్టుకుని నిరసన తెలుపుతున్నామన్నారు.

# ప్రతీకార పాలన.. ప్రజా ధనం దుర్వినియోగం

**రేవంత్ సర్కార్‌పై ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ నిప్పులు**

**కాంగ్రెస్ మంత్రుల కుంభకోణాలపై సిట్ వేయగలరా..?**

**రేవంత్ రెడ్డికి ఆర్ఎస్పి సవాల్**

ఆసిఫాబాద్, ఏప్రిల్ 11 (తీన్మార్ న్యూస్):



తెలంగాణ రాష్ట్రంలో ప్రజా ధనాన్ని దుర్వినియోగ పరుస్తూ,ప్రతిపక్ష నాయకులను జైలుకు పంపడానికి పేరు మోసిన లాయర్లకు ఖర్చు చేస్తున్నారని, ప్రజలు ఇచ్చిన గొప్ప అవకాశాన్ని రేవంత్ రెడ్డి సద్వినియోగం చేసుకోవడంతో విఫలమవుతున్నాడని బిఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా.ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆరోపించారు. మహాత్మ జ్యోతిరావు ఫూలే 199 వ జయంతి సందర్భంగా కోస్ని గ్రామంలో ఫూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం విద్యుత్ శాఖలో కుంభకోణం జరిగిందని జస్టిస్ నరసింహారెడ్డి కమీషన్ వేశారు, కాళేశ్వరం ప్రాజెక్టులో లక్ష కోట్ల అవినీతి అంటూ పిసి ఘోష్ కమీషన్ వేశారు, టెలిగ్రాఫ్ చట్టం సెక్షన్ 5 ప్రకారం ప్రభుత్వం టెలిఫోన్ ట్యాపింగ్ చేస్తే,అది అక్రమమని మరో సిట్ వేశారు, ఫార్ములా ఈ రేస్ లో అవినీతి జరిగిందని ఇంకో సిట్ వేశారు,ఇటీవల డ్రగ్స్ కేసులో మరొక సిట్ వేశారు. ఇలా రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయినప్పటి నుండి సిట్ లు వేస్తూ,ప్రజల సొమ్మును పేరు మోసిన లాయర్లకు ఫీజులుగా చెల్లిస్తూ ప్రతీకార పాలన చేస్తున్నారు. గత రెండున్నరేళ్లుగా రేవంత్ సిట్ లతోనే పాలన సాగిస్తున్నారని ఆయన విమర్శించారు. వాస్తవానికి రేవంత్ రెడ్డి బ్రదర్స్ చేస్తున్న భూ కబ్జాలు, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వసూలు చేస్తున్న 20 శాతం కమీషన్ల గురించి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చేస్తున్న భూ కబ్జా గురించి, తుమ్మల నాగేశ్వరరావు చేస్న వెలుగుమట్ల భూ ఆక్రమణ, నైని కోల్ మైన్ కుంభకోణంలో కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిపై మరియు 2 వేల కోట్ల గురుకుల కంట్రాక్టు టెండర్ల కుంభకోణం గురించి సిట్ వేయాలని ఆయన డిమాండ్ చేశారు. రేవంత్ రెడ్డి అలవికాని హామీలు, అబద్ధాలు చెప్పి ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చాడని, వచ్చిన అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, కేసిఆర్ వలే మంచి పనులు చేసి ప్రజలకు చేరువ కావాలని సూచించారు. కానీ రేవంత్ రెడ్డి ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని వినియోగించుకోవడంలో విఫలమయ్యారని తెలిపారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, తప్పకుండా రాబోయే రోజుల్లోగా గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. మహాత్మ జ్యోతిరావు ఫూలే తన జీవితాంతం చదువు కొరకే పోరాటం చేశారని, చదువుతోనే పేదలకు డబ్బు,జ్ఞానం సంపాదించగలరని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ సీనియర్ నాయకులు కొంగ సత్యనారాయణ, గ్రామ సర్పంచ్ పుల్లభాయి, కాగజ్ నగర్ పట్టణ నాయకులు మిన్హాజ్, తన్నీరు పోచం, నక్క మనోహర్, హన్మంత్, కాగజ్ నగర్ మండల అధ్యక్షులు పర్వతి అంజన్న, భట్ పల్లి సర్పంచ్ రాజేందర్, యూత్ నాయకులు కాశిపాక రాజు తదితరులు పాల్గొన్నారు.

# రాజ్యసభ రేసు
## భారీగా పెరుగుతున్న ఆశావహులు

విజయవాడ

తెలుగుదేశం పార్టీలో రాజ్యసభ సీట్ల కేటాయింపు అంశం ఇప్పుడు ఏపీ రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది. జూన్‌లో ఖాళీ అవుతున్న నాలుగు స్థానాలకు గాను, టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ఎవరిని ఎంపిక చేస్తారనే దానిపై పార్టీ వర్గాల్లో తీవ్ర స్థాయిలో కసరత్తు జరుగుతోంది. ప్రస్తుతం వినిపిస్తున్న పేర్లలో స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు కుమారుడు చింతకాయల విజయ్ పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. మిగిలిన స్థానాలకు రకరకాల పేర్లు చర్చల్లోకి వస్తున్నాయి. టీడీపీ ఐటీ విభాగంలో చురుగ్గా ఉంటూ, గత ఎన్నికల్లో పార్టీ సోషల్ మీడియా వ్యూహకర్తగా పనిచేసిన చింతకాయల విజయ్ పేరు రేసులో ముందుండటానికి ప్రధాన కారణం యువతకు ప్రాధాన్యత ఇవ్వాలన్న అధిష్టానం ఆలోచనే. ముఖ్యంగా ఉత్తరాంధ్ర ప్రాంతం నుంచి బలమైన బీసీ నాయకత్వాన్ని ప్రోత్సహించాలనే ఉద్దేశంతో విజయ్ వైపు చంద్రబాబు మొగ్గు చూపుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. గత ప్రభుత్వ హయాంలో అనేక రాజకీయ సవాళ్లను ఎదుర్కొని పార్టీ కోసం నిలబడినందుకు ఆయనకు ఈ గుర్తింపు దక్కవచ్చని క్యాడర్ భావిస్తోంది.మరోవైపు, పార్టీలో అత్యంత సీనియర్ నేత అయిన యనమల రామకృష్ణుడు పేరు కూడా చర్చల్లో ఉంది. గత కొంతకాలంగా ఆయన రాజ్యసభకు వెళ్లాలని ఆశిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. పార్టీకి ట్రబుల్ షూటర్‌గా, ఆర్థిక వ్యవహారాల్లో పట్టున్న నేతగా యనమల సేవలను ఢిల్లీ స్థాయిలో ఉపయోగించుకోవాలని అధిష్టానం భావిస్తే ఆయనకు అవకాశం దక్కవచ్చు. అయితే, సామాజిక సమీకరణాలు , కొత్త రక్తాన్ని ఎక్కించాలనే లోకేష్ వ్యూహం కారణంగా సీనియర్లకు ఏ మేరకు ప్రాధాన్యత ఉంటుందన్నది ఉత్కంఠగా మారింది. వ్యాపార కారణాలు, రాజకీయ ఒత్తిళ్ల వల్ల గత లోక్‌సభ ఎన్నికలకు దూరంగా ఉన్న గల్లా జయదేవ్ పేరు మళ్లీ తెరపైకి వచ్చింది. పార్లమెంటులో రాష్ట్ర సమస్యలపై గళం విప్పడంలో ఆయనకు ఉన్న అనుభవం, అంతర్జాతీయ స్థాయిలో ఆయనకున్న నెట్‌వర్క్ పార్టీకి అవసరమని చంద్రబాబు భావిస్తున్నట్లు సమాచారం. అయితే, ఆయన రాజకీయాలకు బ్రేక్ ఇస్తున్నట్లు గతంలోనే ప్రకటించినందున, మళ్లీ రాజ్యసభ ద్వారా క్రియాశీలక రాజకీయాల్లోకి వస్తారా లేదా అన్నది వేచి చూడాల్సి ఉంది. ఇక గత ఎన్నికల్లో చాన్స్ దొరకని దేవినేని ఉమ కూడా రేసులో ఉన్నారు. యువనేతలు వంగవీటి రాధాతో పాటు మహాసేన రాజేష్ వంటి వారు కూడా సామాజికవర్గ కోటాల్లో ప్రయత్నాలు చేస్తున్నారు. రాజ్యసభ అభ్యర్థుల ఎంపికలో చంద్రబాబు ప్రధానంగా మూడు సూత్రాలను పాటిస్తున్నట్లు తెలుస్తోంది. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు అండగా నిలిచిన వారికి ప్రాధాన్యత ఇస్తారు. బీసీ, ఎస్సీ , కాపు సామాజిక వర్గాలకు సమతుల్యత పాటించడం.. కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేసుకుంటూ, రాష్ట్ర ప్రయోజనాల కోసం గట్టిగా మాట్లాడగలిగే వ్యక్తులను పంపే అంశాలను పరిశీలిస్తున్నారు. వీరితో పాటు పార్టీ కోసం పనిచేసిన మరికొందరు పారిశ్రామికవేత్తలు, ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన ప్రతిపాదనలను కూడా టీడీపీ పరిశీలిస్తోంది. ఢిల్లీలో పార్టీ వాయిస్ బలంగా వినిపించే వారికే చంద్రబాబు ప్రాధాన్యత ఇవ్వనున్నారు. మిత్రపక్షాలకూ సీట్లు కేటాయించాల్సి ఉంది. జాతీయ స్థాయి ప్రాధాన్యత దృష్ట్యా బీజేపీ ఓ సీటును కోరుకుంటుందని అంచనా వేస్తున్నారు. బీజేపీకి ఇస్తే జనసేన పార్టీకి చాన్స్ ఉండకపోవచ్చని అంచనా వేస్తున్నారు. రాజ్యసభ ఎన్నికల షెడ్యూల్ ఎప్పుడైనా వచ్చే అవకాశం ఉన్నందున అభ్యర్థుల ఎంపికను చంద్రబాబు ఫైనల్ చేస్తున్నారు.

## టీడీపీలో థర్డ్ జనరేషన్..3.0



విజయవాడ

తెలుగుదేశం పా జాతీయ ప్రధాన కార్యదర్శి , మంత్రి నారా లోకేష్ పార్టీ సంస్థాగత నిర్మాణంపై తనదైన ముద్ర వేస్తున్నారు. పార్టీని సాంకేతికంగా పరిపుష్టం చేస్తూ, అట్టడుగు స్థాయి కార్యకర్తలతో నేరుగా సంబంధాలు నెలకొల్పుకుంటూ ౹ఆఖ 3.0 అనే కొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టారు. లోకేష్ ఇటీవలే ౹ఆఖ 3.0 వెర్షన్‌ను లాంచ్ చేశారు. ఇది కేవలం ఒక నినాదం కాదు, పార్టీని మరింత శక్తివంతంగా, జవాబుదారీతనంతో నడిపించే ఒక వ్యవస్థ. ఇందులో భాగంగా కార్యకర్తలకు నేరుగా గుర్తింపు ఇవ్వడం, వారి పనితీరును అంచనా వేయడం వంటి అంశాలకు ప్రాధాన్యత ఇస్తున్నారు. పార్టీని ఒక నాయకులను తయారు చేసే విశ్వవిద్యాలయం గా తీర్చిదిద్దాలని, ఏడాదికి కనీసం 300 రోజుల పాటు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని ఆయన లక్ష్యంగా పెట్టుకున్నారు.పార్టీలో క్రమశిక్షణ విషయంలో లోకేష్ చాలా కఠినంగా వ్యవహరిస్తున్నారు. ఇటీవల మళ్లీ గెలవాలంటే ప్రజల మధ్యే ఉండాలి అని ఎమ్మెల్యేలకు స్పష్టమైన హెచ్చరికలు జారీ చేశారు. రెవెన్యూ వ్యవహారాల్లో జోక్యం చేసుకున్నా, ఇసుక లేదా ఇతర అక్రమ రవాణాలో పాల్గొన్నా సహించేది లేదని తెగేసి చెప్పారు. నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేల పనితీరును, ప్రజల్లో వారికున్న ఇమేజ్‌ను ఎప్పటికప్పుడు సర్వేల ద్వారా అంచనా వేస్తూ, గ్రాఫ్ పడిపోయిన వారికి క్లాస్ తీసుకుంటున్నారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకోవడానికి లోకేష్ నిర్వహిస్తున్న ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నారు. ఇప్పటికే 85కు పైగా ప్రజా దర్బార్‌లు నిర్వహించి, వేలాది మంది అర్జీలను స్వయంగా స్వీకరించారు. మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో ఉదయాన్నే అందుబాటులో ఉంటూ, ప్రజల నుండి వచ్చే ఫిర్యాదులను పరిష్కరించేందుకు అధికారులతో నేరుగా మాట్లాడుతున్నారు. ఇది కేవలం సామాన్య ప్రజలకే కాకుండా, పార్టీ కార్యకర్తలకు కూడా తమ నాయకుడిని నేరుగా కలిసే ధైర్యాన్ని ఇస్తోంది.సాంకేతికతపై పట్టున్న లోకేష్, పార్టీ పర్యవేక్షణ కోసం ఓఎ ౹ఆఖ యాప్‌ను సమర్థవంతంగా వాడుతున్నారు. ఈ యాప్ ద్వారా క్షేత్రస్థాయిలో ఏ కార్యకర్త చురుగ్గా ఉన్నారో, ఏ బూత్ స్థాయిలో పార్టీ బలహీనంగా ఉందో డేటా రూపంలో విశ్లేషిస్తున్నారు. పనితీరు ఆధారంగానే పదవులు, గుర్తింపు ఉంటాయని స్పష్టం చేయడం ద్వారా పార్టీలో సమర్థులకు ప్రాధాన్యత లభిస్తోంది. పారిశ్రామిక వేత్తల తరహాలో డాష్ బోర్డ్ మేనేజ్‌మెంట్ ద్వారా పార్టీ వ్యవహారాలను పర్యవేక్షించడం ఆయన పనితీరుకు నిదర్శనం. కష్టకాలంలో పార్టీ జెండా మోసిన కార్యకర్తలను లోకేష్ కంటికి రెప్పలా కాపాడుకుంటున్నారు. వైసీపీ హయాంలో కేసులు ఎదుర్కొన్న వారిని ఆదుకోవడంతో పాటు, పార్టీ ఆవిర్భావ దినోత్సవం వంటి వేదికలపై సామాన్య కార్యకర్తలకు సీనియర్ నేతలతో సమానంగా గౌరవం కల్పిస్తున్నారు. పదవులు మూడు సార్లు మాత్రమే అనే కొత్త ప్రతిపాదన ద్వారా కొత్త రక్తాన్ని పొలిట్‌బ్యూరో స్థాయికి చేర్చాలని ఆయన చూస్తున్నారు. ఇది యువ నాయకత్వంలో కొత్త ఉత్సాహాన్ని నింపుతోంది.లోకేష్ కేవలం చంద్రబాబు వారసుడిగా కాకుండా, తనకంటూ ఒక సొంత పనితీరు బ్రాండ్ ను సృష్టించుకున్నారు. అడ్మినిస్ట్రేషన్‌లో చురుగ్గా ఉంటూనే, పార్టీ యంత్రాంగాన్ని 24/7 అలెర్ట్‌గా ఉంచడంలో ఆయన సఫలీకృతమవుతున్నారు. లోకేష్ అనుసరిస్తున్న ఈ కార్పొరేట్ తరహా రాజకీయ వ్యూహం, అట్టడుగు స్థాయి కార్యకర్తలతో ఉన్న అనుబంధం టీడీపీని రాబోయే దశాబ్ద కాలానికి సిద్ధం చేస్తోందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

## ఏపీలో చిన్నారులకు సోషల్ మీడియా బ్యాన్

నెల్లూరు




ఏపీలో 13 ఏళ్ల పిల్లలకు సోషల్ మీడియా బ్యాన్ చేయటంపై ప్రభుత్వం ఫోకస్ పెటటింది. ఇప్పటికే ప్రాథమికంగా కసరత్తు చేయగా? త్వరలోనే విధివిధానాలు తయారుచేసి, ముసాయిదా చట్టాన్ని సిద్ధం చేయనున్నారు.ఇదే అంశంపై తాజాగా ఐటీ మంత్రి నారా లోకేశ్ సమీక్షించారు. చిన్నపిల్లలను సోషల్ మీడియాకు దూరంగా ఉంచేందుకు విధివిధానాల తయారీ, చట్టరూపకల్పనపై మంత్రుల బృందం చర్చించింది పిల్లలకు వయసు ఆధారిత కంటెంట్ ను అందుబాటులో ఉంచేవిధంగా విధివిధానాలను రూపొందించాలని అధికారులను ఆదేశించారు. సోషల్ మీడియాలో మహిళలపట్ల అవమానకరమైన, విద్వేషపూరిత వ్యాఖ్యలు చేసే వారిపై కఠినంగా వ్యవహరిస్తామన్నారు. పిల్లల డిజిటల్ భద్రత, శ్రేయస్సు, లీగల్ మెకానిజం ఫ్రేమ్ వర్క్ పై ఇతర రాష్ట్రాలు, దేశాల్లో అనుసరిస్తున్న అత్యుత్తమ విధానాలను అధికారులు అధ్యయనం చేయాలన్నారు.పిల్లలను సెన్సిటివ్ కంటెంట్ కు దూరంగా ఉంచడంపై ఆస్ట్రేలియా, సింగపూర్, డెన్మార్క్ వంటి దేశాల్లో అమలు చేస్తున్న విధానాలను అధ్యయనం చేయాలని మంత్రి నారా లోకేశ్ సూచించారు. పిల్లలపై సోషల్ మీడియా ప్రభావంపై పెద్దఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని ప్రకటించారు. నో బ్యాగ్ డే రోజున ఉపాధ్యాయులు విద్యార్థులకు, ప్రతిఏటా రెండుసార్లు నిర్వహించే మెగా పిటిఎంలో కూడా తల్లిదండ్రులు, విద్యార్థులకు సోషల్ మీడియా దుష్ప్రభావాలపై అవగాహన కల్పిస్తామన్నారు.వయసు నిర్ధారణ కోసం డిజిలాకర్ తో కూడిన ఏజ్ టోకెన్ ల వినియోగంపై అధ్యయనం చేయాల్సిందిగా మంత్రి లోకేశ్ అధికారులకు సూచించారు. ప్రజాభిప్రాయం అనంతరం కేంద్రప్రభుత్వ చట్టపరిధిలోని అంశాలపై నివేదికను అందజేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా సున్నితమైన కంటెంట్ ను చిన్నపిల్లలకు దూరంగా ఉంచడంపై విధివిధానాలు, ఫిర్యాదులపై తీసుకుంటున్న చర్యలను వివిధ సోషల్ మీడియా ప్లాట్ ఫాంల ప్రతినిధులు మంత్రుల బృందానికి వివరించారు. ఐటీ చట్టంలోని సెక్షన్ ? 46 కింద న్యాయ నిర్ణయాధికారిని వెంటనే నియమించేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.13 ఏళ్లలోపు పిల్లలను సోషల్ మీడియాకు దూరంగా ఉంచడంపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రాథమికంగా కసరత్తు చేస్తోంది. ఆస్ట్రేలియా, సింగపూర్ మరియు డెన్మార్క్ వంటి దేశాల్లో అమలులో ఉన్న మైనర్ల డిజిటల్ భద్రతా చట్టాలను అధికారులు అధ్యయనం చేస్తున్నారు. ముసాయిదా చట్టం సిద్ధం చేసిన తర్వాత ఏపీ కేబినెట్ ఆమోదముద్ర వేయాల్సి ఉంటుంది. ఆ తర్వాత శాసనసభ ఆమోదం తర్వాత? గవర్నర్ సంతకం చేయాలి. ఆ తర్వాత గెజిట్ విడుదలవుతుంది.

## 14 నుంచి 21 చిత్తూరు జిల్లాల్లో నియోజకవర్గాలు

తిరుపతి

ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు నాయుడు సొంత జిల్లా అయిన ఉమ్మడి చిత్తూరు జిల్లాలో నియోజకవర్గాల పునర్విభజన అంశం ఇప్పుడు పెను సంచలనంగా మారింది. కేంద్రం నుంచి వస్తున్న సంకేతాలతో జిల్లా రాజకీయ స్వరూపమే మారిపోబోతోంది. ప్రస్తుతం ఉన్న 14 అసెంబ్లీ స్థానాల సంఖ్య ఏకంగా 21కి పెరిగే అవకాశం ఉండటంతో రాజకీయ పార్టీల్లోనూ, అభ్యర్థుల్లోనూ కొత్త ఆశలు చిగురిస్తున్నాయి. 2004 వరకు ఉమ్మడి జిల్లాలో 15 నియోజకవర్గాలు ఉండేవి. 2009 పునర్విభజనలో వాయల్పాడు, పుత్తూరు, వేపంజేరి నియోజకవర్గాలు రద్దు కాగా.. కొత్తగా గంగాధర నెల్లూరు, పూతలపట్టు ఏర్పడ్డాయి. దీంతో సీట్ల సంఖ్య 14కి తగ్గింది. అయితే తాజా ప్రతిపాదనల ప్రకారం ఈ సంఖ్య 21కి చేరనుండటం విశేషం.రాష్ట్రంలోనే అతిపెద్ద జిల్లాగా ఆవిర్భవించిన తిరుపతిలో జనాభా ప్రాతిపదికన భారీ మార్పులు చోటుచేసుకోనున్నాయి. చంద్రగిరి నియోజకవర్గంలో భాగంగా ఉన్న తిరుపతి రూరల్ మండలాన్ని విడదీసి కొత్త నియోజకవర్గంగా మార్చే అవకాశం ఉంది. ఇందులో రామచంద్రపురం మండలాన్ని కూడా కలిపే అవకాశం ఉంది. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ఓటర్ల సంఖ్య భారీగా ఉండటంతో రేణిగుంట కేంద్రంగా కొత్త సీటు ఏర్పాటుపై చర్చ జరుగుతోంది. గతంలో రద్దయిన పుత్తూరు నియోజకవర్గం మళ్ళీ తెరపైకి రానుంది. సూళ్లూరుపేట నియోజకవర్గం నుంచి నాయుడుపేటను విడదీసి కొత్త నియోజకవర్గం చేసే ఛాన్స్ ఉంది.పూతలపట్టు నియోజకవర్గంలోని బంగారుపాళ్యం కేంద్రంగా కొత్త స్థానం ఏర్పాటయ్యే అవకాశాలు ఉన్నాయి. పీలేరు నియోజకవర్గం నుంచి కలికిరి కేంద్రంగా మరో కొత్త నియోజకవర్గం ఏర్పాటుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి.అసెంబ్లీ స్థానాలతో పాటు ఉమ్మడి జిల్లాలో మరో లోక్ సభ స్థానం కూడా పెరిగే అవకాశం ఉందన్న చర్చ జోరుగా సాగుతోంది. ప్రస్తుతం చిత్తూరు, తిరుపతి రెండు పార్లమెంట్ స్థానాలు ఎస్సీ రిజర్వ్‌డ్ కావడంతో కొత్తగా ఏర్పడే పార్లమెంట్ స్థానం జనరల్ కేటగిరీ అవుతుందన్న అంచనాలు ఉన్నాయి. దీంతో ఇప్పటి నుంచే ఆయా నియోజకవర్గాల కీలక నేతలు ఢిల్లీ స్థాయిలో పావులు కదుపుతున్నారు. జిల్లాల విభజనతో ఇప్పటికే మూడు ముక్కలైన ఉమ్మడి చిత్తూరు జిల్లా ఇప్పుడు నియోజకవర్గాల పెంపుతో పొలిటికల్ పవర్‌హౌస్‌గా మారబోతోంది. ఈ మార్పులు ఏ పార్టీకి కలిసి వస్తాయి? పాత నియోజకవర్గాల సరిహద్దులు ఎలా మారుతాయి? అన్నది ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది.

## జనారణ్యంలోకి జంతువులు

కర్నూలు

రాయలసీమ వ్యాప్తంగా జనావాసాల్లోకి చిరుతల చొరబాట్లు పెరగడం కనిపిస్తోంది. పులులకు తీవ్రమైన నీటి కొరత, ఆవాసాలు తగ్గిపోవడం, పెరుగుతున్న పర్యావరణ ఒత్తిడే ఈ ధోరణికి కారణమని అటవీ అధికారులు పేర్కొంటున్నారు. తక్షణమే సరిదిద్దే చర్యలు తీసుకోకపోతే.. ఈ ప్రాంతంలో మానవ-వన్యప్రాణుల సంఘర్షణ తీవ్రంగా పెరిగే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు.వైఎస్ఆర్ కడప జిల్లా దువ్వూరు మండలం చిన్న బకరపురం గ్రామంలో ఇటీవల జరిగిన ఓ ఘటన జరిగింది. గ్రామంలోకి ప్రవేశించిన చిరుత పిల్లను వీధి కుక్కలు చంపడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. అటవీ అధికారుల సమాచారం ప్రకారం, రాయలసీమలో గత మూడేళ్లలో మానవ నివాస ప్రాంతాల్లోకి ప్రవేశించిన 30కి పైగా చిరుతలు మరణించాయి. ఆందోళనకరంగా, గత సంవత్సరంలోనే 16 మరణాలు నమోదయ్యాయి.చిరుతపులులు మేకలు, గొర్రెలు, దూడలు, ఆవులు వంటి జంతువులను ఇష్టపడతాయి. ఆహారం కోసం అవి మానవ నివాస ప్రాంతాల్లోకి ప్రవేశిస్తాయి. కొన్నిసార్లు, అటవీ ప్రాంతాల్లో సమీపంలో నీటి వనరులు లేకపోవడం కూడా ఒక కారణంగా ఉంది. చిరుతపులులు దట్టమైన అడవుల్లో లోపల ఉండటానికి బదులుగా, కొద్దిగా బహిరంగ లేదా మైదాన ప్రాంతాల్లోకి వెళ్లడానికి ఇష్టపడతాయని అటవీ అధికారులు అంటున్నారు.చిరుతపులులు మనుషులపై దాడి చేయడానికి బయటకు రావడం లేదు. కానీ ఆకస్మాత్తుగా మనిషి ఎదురైతే దాని రక్షణలో భాగంగా దాడి చేయాల్సిన పరిస్థితులు ఏర్పడతాయి. వాటి సంచారం ప్రధానంగా ఆహారం, నీటి అన్వేషణ కోసమే ఉంటుంది. అడవుల అంచున ఉన్న గ్రామాల్లోకి చిరుతలు ఎక్కువగా వస్తుంటాయి.వేటగాళ్లు ఏర్పాటు చేసిన ఉచ్చులు, అడవి పందులను నివారించడానికి రైతులు ఏర్పాటు చేసిన విద్యుత్ కంచెలు పులులకు ఇబ్బందికరంగా మారాయి. విద్యుత్ కంచెల కారణంగా ప్రమాదవశాత్తు మరణాలు పెరుగుతున్నాయి. రైతులలో తక్షణమే అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది.అటవీ భూముల ఆక్రమణలతో పులుల సహజ ఆవాసాలను తగ్గిపోయేలా చేస్తూ, వన్యప్రాణులను మానవ నివాసాలకు మరింత దగ్గరగా నెడుతున్నాయి. దట్టమైన అడవుల్లో ఉండాల్సిన వన్యప్రాణులు ఇప్పుడు జనావాస ప్రాంతాల వైపు వస్తున్నాయి. కొన్ని ప్రాంతాల్లో చిరుతపులుల సంచారం ఎక్కువగా ఉందని, ఇది తమ జీవనోపాధికి ముప్పుగా మారిందని రైతులు వాపోతున్నారు.కొన్నిసార్లు పొలాల దగ్గర చిరుతపులులు సంచారం ఉన్నట్టుగా రైతులు చూస్తున్నారు. దానికి సంబంధించిన ఆనవాళ్లు కనిపిస్తున్నాయి. పశువులను, మేకలను మేతకు బయటకు తీసుకెళ్లాలంటే భయపడుతున్నాయి.

## పాతబస్తీ మెట్రోకు గ్రీన్ సిగ్నల్

-మొదటిపేజీ తరువాయి

నిర్ణయించారు. పాతబస్తీ వాసుల చిరకాల స్వప్నమైన మెట్రో పనులను పర్యావరణ హితంగా పూర్తి చేయడమే లక్ష్యంగా హామల్ అడుగులు వేస్తోంది. టెండర్లు దక్కించుకున్న సంస్థ ఈ పనులను మూడు నెలల గడువులోగా పూర్తి చేయాల్సి ఉంటుంది. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి చెట్లను వేళ్లతో సహా పెకిలించి సురక్షిత ప్రాంతాలకు తరలిస్తారు. మెట్రో రెండో దశ విస్తరణలో భాగంగా పాతబస్తీ లైన్ అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది. దారుల్షిఫ, పురానీ హవేలీ, ఈతేబార్ చౌక్, ఆలిజా కోట్లా, లాల్ బజార్, మీర్ ఆలం మండి వంటి రద్దీ ప్రాంతాల గుండా ఈ రైలు ప్రయాణించనుంది. ఇరుకైన రహదారులు చారిత్రక కట్టడాల మధ్య మెట్రో పిల్లర్ల నిర్మాణం సవాలుగా మారింది. ప్రస్తుతం చెట్ల మార్పిడి ప్రక్రియ పూర్తికావడంతో సివిల్ పనులకు మార్గం సుగమం కానుంది. ప్రభుత్వం ఈ ప్రాజెక్టును ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. గతంలో ఎదురైన న్యాయపరమైన సాంకేతికపరమైన ఇబ్బందులన్నీ తొలగిపోవడంతో పనులు వేగవంతం అయ్యాయి. చెట్ల తరలింపు ప్రక్రియలో పర్యావరణ నిపుణుల పర్యవేక్షణ ఉంటుంది. ప్రాజెక్టు త్వరితగతిన పూర్తయితే పాతబస్తీ నుంచి నగరంలోని ఇతర ప్రాంతాలకు రవాణా వ్యవస్థ మెరుగుపడుతుంది. ట్రాఫిక్ కష్టాల నుంచి స్థానికులకు విముక్తి లభిస్తుంది. వచ్చే మూడు నెలల్లోగా చెట్ల తరలింపు ప్రక్రియను ముగించి పిల్లర్ల నిర్మాణాన్ని ప్రారంభించాలని హామల్ భావిస్తోంది. పర్యావరణాన్ని కాపాడుతూనే అభివృద్ధి పనులను ముందుకు తీసుకెళ్లడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## ఏది పడితే అది మాట్లాడితే ఊరుకోం

-మొదటిపేజీ తరువాయి

సీతక్క. కరెంటు లేదు, తాగునీరు లేదు, కనీస మౌలిక సదుపాయాలు లేవన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 12,500 అంగన్‌వాడీలకు భవనాలే లేకపోయినా నాటి పాలకులు పట్టించుకోలేదన్నారు.కానీ తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మార్పు మొదలైందదన్నారు. ఇప్పటికే రెండు వేల కొత్త అంగన్‌వాడీ భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు చేశామని చెప్పారు. కేవలం పౌష్టికాహారం అందించడమే కాదు.. అంగన్‌వాడీలను సకల సౌకర్యాలతో 'ప్రీ-ప్రైమరీ స్కూల్స్'గా తీర్చిదిద్దుతుంటే.. అది ఓర్వలేక కొన్ని పార్టీలు అసత్య ఆరోపణలు చేస్తున్నాయని విమర్శించారు సీతక్క. ఇక సెల్ ఫోన్ల కొనుగోలుపై క్లారిటీ ఇస్తూ.. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగానే ఐదుగురు నిపుణులైన అధికారుల కమిటీ పర్యవేక్షణలో అత్యంత పారదర్శకంగా టెండర్లు నిర్వహించామని స్పష్టం చేశారు. విమర్శలు పక్కన పెట్టి ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతామని సీతక్క చెప్పారు.

## నేడే తెలంగాణ ఇంటర్ ఫలితాలు
## ఉదయం 11 గంటలకు విడుదల




తెలంగాణ బ్యూరో, ఏప్రిల్ 11 (తీన్మార్ న్యూస్):

తెలంగాణలో లక్షలాది మంది విద్యార్థులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న ఇంటర్మీడియట్ ఫలితాల విడుదలకు ముహూర్తం ఖరారైంది. ఆదివారం అనగా ఏప్రిల్ 12న ఉదయం 11 గంటలకు ఫలితాలు విడుదల కానున్నాయి. దీనిపై ఇంటర్ బోర్డు అధికారికంగా ప్రకటన విడుదల చేసింది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా పరీక్షలు రాసిన సుమారు 9.97 లక్షల మంది విద్యార్థుల నిరీక్షణకు తెరపడనుంది. ఏడాది ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు ఫిబ్రవరి 25 నుంచి మార్చి 18 వరకు జరిగాయి. ప్రథమ సంవత్సర పరీక్షలకు 4.41 లక్షల మంది, ద్వితీయ సంవత్సర పరీక్షలకు సుమారు 5.07 లక్షల మంది విద్యార్థులు హాజరయ్యారు. పరీక్షలు ముగిసిన తక్కువ కాలంలోనే జవాబు పత్రాల మూల్యాంకనం పూర్తి చేసి, ఫలితాలను సిద్ధం చేసినట్లు బోర్డు కార్యదర్శి వెల్లడించారు.

## వైసీపీలో మారుతున్న సామాజిక లెక్కలు

విజయవాడ



వైఎస్సార్ పార్టీ.. ఏపీలో విపక్షం. మాజీ సీఎం వైఎస్సార్ తనయుడిగా రాజకీయాల్లోకి అడుగుపెట్టి, ఆ తర్వాత ఉమ్మడి రాష్ట్ర విభజన, కాంగ్రెస్ వైఖరితో విభేదించి కొత్తపార్టీ పెట్టిన రాజకీయ అసాధ్యుడు. ఐదేళ్ల విపక్ష బాధ్యతల తర్వాత 2019లో అధికారాన్ని సైతం సాధించి, సీఎంగా పాలన సాగించారు. పరిపాలన సమయంలో తీసుకున్న కొన్ని నిర్ణయాలకు ప్రజామోదం లేకపోవడం, అదే సమయంలో చంద్రబాబు, లోకేష్ అలుపెరగక చేపట్టిన ప్రచారంతో.. వైసీపీ ఘోరంగా ఓటమి పాలైంది.

బేసిగ్గా చూస్తే.. జగన్ అధికారంలో ఉన్నప్పుడు వైసీపీలో ఎక్కువ పదవులు రెడ్డి సామాజిక వర్గానికే దక్కాయి. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు ఆయా సామాజిక వర్గం నేతలు.. రాజకీయాల్లో హడావుడి చేసేవారు. వారు కోటరీ కట్టి జగన్ కు కళ్లు, చెవులుగా వ్యవహరించారన్న విమర్శలు ఉన్నాయి. అలాంటి నేతలు పవర్ పోవడం, లోకేష్ రెడ్ బుక్ లాంటి పరిణామాలతో కాస్త సైలెంట్ అయ్యారు. వారిస్థానాల్లో ఇప్పుడు బీసీ, ఎస్సీ ఎస్టీ నేతలు .. ముందుండి పార్టీ కార్యక్రమాలను నడుపుతున్నారు.బొత్స సత్యనారాయణ శాసనమండలిలో ప్రతిపక్ష నేతగా చురుకుగా వ్యవహరిస్తుండగా, అంబటి రాంబాబు, పేర్ని నాని పార్టీ స్వరంగా నిలుస్తున్నారు. జోగి రమేష్ కూడా బెయిల్‌పై విడుదలైన తర్వాత తన స్వరాన్ని మరింత పెంచారు. పార్టీ కార్యక్రమాలు, మీడియా సమావేశాల్లో వీరే ముందుండటం స్పష్టంగా కనిపిస్తోంది. ఈ పరిణామాలన్నింటినీ పరిశీలిస్తే? వైసీపీలో సామాజిక సమీకరణాలు కొత్త దిశగా మారుతున్నాయన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.కష్టకాలంలో బీసీ, ఎస్సీ వర్గాలకు చెందిన నేతలు ముందుకు వచ్చి పార్టీని నిలబెట్టే ప్రయత్నం చేస్తున్నారని, అదే సమయంలో జగన్‌కు సమీపంగా ఉన్న నేతలు వ్యూహాత్మకంగా దూరంగా ఉంటున్నారనే చర్చ రాజకీయ వర్గాల్లో జోరుగా సాగుతోంది. ఇదే నేతలు ఒక వేళ జగన్రాజకీయంగా పుంజుకుంటే మళ్లీ ఆయన పక్కకు చేరతారని, కోటరీ కడతారనే వాదనలు వినిపిస్తున్నాయి.గతంలో జగన్ అధికారంలోకి రాగానే తన సామాజిక వర్గానికి చెందిన వారికి ముఖ్యమైన మంత్రి పదవులను అప్పగించారు. జగన్ హయాంలో దాదాపు 24 మంది ప్రభుత్వ సలహాదారులలో 17 మంది రెడ్డి సామాజిక వర్గానికి చెందినవారే ఉండటం అప్పట్లో రాజకీయంగా చర్చనీయాంశమైంది. ఇప్పుడు అదే నేతలు మౌనంగా ఉండడానికి కారణం ఏమిటనే చర్చ సాగుతోంది.

తీన్మార్
తెలుగు దిన పత్రిక

# కష్టాల కడలిలో కరెంటు కార్మికులు

'ఎగిరెగిరి దంచినోడికి అదే కూలి.. ఎగరకుండా దంచినోడికి అదే కూలి' అన్నట్లు ఎసిలో కూర్చునోళ్లకు అదే కూలి. ఎండనక, వాననకా, రాత్రనక, పగలనక కరెంటు కోసం చెట్లు పుట్టలు ఎక్కెటోళ్లకు అదే కూలి, కాదు అంతకన్నా తక్కువ కూలీ అదేంది అనుకుంటున్నారా ఇది నిజం. కింద కూసోని పని చెప్పేటోళ్లకు పైసలెక్కువ, అదే కరెంటు స్తంభాలెక్కి పనిచేసే కార్మికులకు తక్కువ జీతం, ఎక్కువ శ్రమ, గ్యారెంటీలేని జీవితం ఎప్పుడు ఏమవుతుందో అర్థంకాని పరిస్థితి ఇన్ని ఇబ్బందులను తట్టుకొని కూడా శ్రమిస్తున్నారంటే నిజానికి కరెంటు కార్మికులకు మనం సెల్యూట్ చేయాల్సిన అవసరం ఉంది. ఒక పది నిమిషాలు కరెంటు పోతే మనం అల్లాడిపోతం, అంతేకాదు మనం 12 గంటలు డ్యూటీ చేస్తేనే అయోమయం అయిపోతాం. మరి అలాంటిది కరెంటు కార్మికుల పరిస్థితి ఎప్పుడైనా చూశారా? మన దేశంలో ఎక్కువ కష్టపడేది ఎవరంటే మొదటగా సైనికులు, ఆ తర్వాత పోలీసులు, కరెంటు కార్మికులు కూడా అత్యధికంగా శ్రమించేవారే. ఇందులో ఎలాంటి సందేహం లేదు. ఎండైనా, వానైనా, రాత్రైనా ప్రమాదకరమైన పరిస్థితుల్లో విద్యుత్ స్తంభాలెక్కి పని చేయడం చిన్న విషయం కాదు. ఒక్క చిన్న తప్పిదం జరిగినా ప్రాణానికి ముప్పు. అయినా కూడా వాళ్లు పనిచేస్తూనే ఉంటారు, ఎందుకంటే సమాజం నడవడానికి వాళ్ళు చేయడం ఎంతో అవసరం లేదంటే అంత చీకటిమయం. మరి అంత శ్రమించేవారికి జీతం ఎందుకు తక్కువ అనుకుంటున్నారా అదే మరి సమస్య ఇక్కడ మనం అర్థం చేసుకోవాల్సింది. 'ఒక గుడ్డివాడికి చూపు రాగానే మొట్టమొదట విసిరేసేది అప్పటివరకు సహాయపడిన చేతికర్రనే' అన్నట్లు ఓడిపోయినా నాయకులకు, గెలిచినా నాయకులకు కరెంటు కార్మికులు చేతికర్రలాంటోళ్ళు వాళ్ళకి పదవి రాగానే కరెంటు కార్మికులను కంటికి కనపడకుండా తిరుగుతారు. అప్పటిదాకా మేము ఉన్నాం మీకు అది చేస్తాం ఇది చేస్తాం అన్నోళ్లే ఆఖరికి ఏమి చేయలేని పరిస్థితి. ఈ కార్మికుల కష్టాలు ఎవరికీ చెప్పుకోవాలో అర్థంకాక కకావికలం అవుతున్నారు. కెసిఆర్ ప్రభుత్వం పర్మినెంట్ చేస్తాం అనగానే కార్మికులకు ఇక మాకు మంచిరోజులు వచ్చినాయి అనుకుండ్రు. తీరా చూస్తే మళ్ళీ మొదటికి వచ్చింది. తెలంగాణ రాష్ట్ర విద్యుత్ సంస్థలలో పనిచేస్తున్న ఆర్టిజన్ కార్మికులకు శాశ్వత హోదా కల్పించమని ఏండ్లతరబడి మొత్తుకున్నా ఎక్కడేసిన గొంగడి అక్కడే అన్నట్లు ఇగ చేస్తాం అగ చేస్తాం అని చెప్పుడే తప్ప చేసింది ఏమీలేదు. గత 18 ఏళ్లకు పైగా తెలంగాణ విద్యుత్ రంగంలో కాంట్రాక్ట్ కార్మికులుగా సేవలందిస్తున్నవారు అప్పటి తెలంగాణ ఉద్యమ సమయంలో, వీరి సేవలను క్రమబద్ధీకరిస్తామని అప్పటి ముఖ్యమంత్రి కెసిఆర్ హామీ ఇచ్చారు. ఆ హామీ నెరవేరకపోవడంతో, 2016లో విద్యుత్ కార్మిక సంఘాలతో కలిసి నిరసన తెలిపారు. నిరసన కారణంగా జులై 28, 2017న పారిశ్రామిక వివాదాల చట్టం, 1947లోని సెక్షన్ 12(3) ప్రకారం ఒప్పందం కుదిరింది. జులై 29, 2017న సంస్థలో విలీనం చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. ఇంతవరకు చూస్తే సమస్య పరిష్కారం దిశగా వెళ్లినట్టే కనిపించింది. అయితే, 'మూలిగే నక్కపై తాటిపండు పడ్డట్లు' కొందరు నిరుద్యోగ యువకులు దీనిని హైకోర్టులో సవాలు చేసి నీరుగార్చేలా చేశారు. సెప్టెంబర్ 18, 2018న హైకోర్టు కార్మికులకు అనుకూలంగా తీర్పునిస్తూ, సెక్షన్ 12(3) ప్రకారం ఈ సమస్యలను పరిష్కరించుకునే అధికారం విద్యుత్ సంస్థలకు, రాష్ట్ర ప్రభుత్వానికి, కార్మిక సంఘులకు ఉందని స్పష్టం చేసింది. అప్పటి సిఎం అసెంబ్లీలో, గవర్నర్ ప్రసంగం ద్వారా 23,667 మంది కార్మికులను క్రమబద్ధీకరించినట్లు ప్రకటించారు. కానీ కార్మికుల రెగ్యులరైజేషన్ అనే ప్రక్రియ అనేక మలుపులు తిరుగుతూ కార్మికులకు పూర్తిస్థాయి క్రమబద్ధీకరణకు బదులుగా, పాత ఉత్తర్వులను రద్దు చేసి, ఫ్యాక్టరీల చట్టం 1946 స్టాండింగ్ ఆర్డర్స్ సర్వీస్ రూల్స్‌ను ప్రవేశపెట్టింది. దీనివల్ల అధికారికంగా శాశ్వత హోదా లేకుండానే కార్మికులకు వేతనాలు చెల్లిస్తున్నారు. 'చెప్పుకొని మురువుచూసుకొని ఏడువు' అన్నట్లు వీరు సమాజం దృష్టిలో శాశ్వత ఉద్యోగులే కానీ, ప్రభుత్వ దృష్టిలో మాత్రం కాదు. కానీ మేమేమీ అదనంగా అడగడం లేదు సార్.. ఇప్పుడు తీసుకుంటున్న జీతాలకే (కరెంట్ పే స్కేల్‌కి) మమ్మల్ని రెగ్యులర్ పోస్టుల్లోకి తీసుకోండి అనేదే మా విజ్ఞప్తి. ప్రభుత్వంపై భారం లేకుండా, మా బతుకుల్ని గాడిలో పెట్టాలనే మా కోరిక మాత్రమే.. అంతే అని అంతలా వేడుకున్నా కూడా ప్రభుత్వం కరుణించకపోవడం.. ఇది మాత్రం కరెంట్ కార్మికుల దౌర్భాగ్యమే అనాలి. ఇంకా బాధాకరమైన విషయం ఏమిటంటే.. విధి నిర్వహణలోనే ఎంతోమంది ప్రమాదాలకు గురై ప్రాణాలు కోల్పోతున్నారు. మా ఆర్టిసన్ కార్మికుల్లో ఃఎవఇఃష్ట్ర, డిప్లొమా, పిజిలు చేసినవాళ్లు కూడా ఉన్నారు. అయినా సరే వారికి సరైన కేడర్ లేకుండా, గౌరవం లేకుండా పని చేస్తున్నారు. వారిని కూడా గౌరవించి, సమాలోచన చేసి, తగిన చర్యలు తీసుకోవాలని, కనీసం మాకు ప్రభుత్వం పాత సర్వీస్ రూల్స్ అమలు చేసి, మా జీవితాల్లో వెలుగులు నింపండని ముక్తకంఠంతో ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.

# దేశభక్తి, జాతీయత కలబోత బసవ పున్నయ్య



భారత దేశంలో ప్రముఖ కమ్యూనిస్టు నేతల్లో మాకినేని బసవ పున్నయ్య ఒకరు. విద్యార్థి సంఘం నేతగా ప్రారంభమైన ఆయన రాజకీయ ప్రస్థానంలో తొలుత కాంగ్రెస్‌లోనే ఓనమాలు దిద్దుకున్నారు. అనంతరం కమ్యూనిస్టు భావాలు ఆకర్షించడంతో సీపీఐలో చేరారు. తెలంగాణ సాయుధ పోరాటంలో పాల్గొని అనంతరం సీపీఎం ఆవిర్భావంలో కీలక పాత్ర పోషించారు. ఆ క్రమంలో ఆయన అంతర్జాతీయ స్థాయి కమ్యూనిస్టు నేతలైన స్టాలిన్, మాలటోవ్, సుస్లోవ్, మాలెంకోవ్‌లతో చర్చలు జరిపారు. అలాగే చైనా కమ్యూనిస్టు దిగ్గజాలు మావోసేటుంగ్, చౌఎన్‌లైతోనూ పున్నయ్యకు సన్నిహిత సంబంధాలున్నాయి. 1952 నుంచి 1966 వరకు రాజ్యసభ సభ్యునిగా పనిచేశారు. కార్ల్‌మార్క్స్, లెనిన్ సిద్ధాంతాలకు కట్టుబడ్డ ఆయన జీవితాంతం రాజీ ఎరగని పోరాట యోధునిగా నిలిచి పోయారు. కామ్రేడ్ బసవ పున్నయ్య రేపల్లె మండం తూర్పుపాలెంలోని భూస్వామ్య కుటుంబంలో 1914 డిసెంబరు 14న జన్మించారు. తల్లిదండ్రులు చారుమతి, అప్పయ్యలకు జన్మించారు. భార్య జగదాంబ. ప్రారంభంలో సాంప్రదాయ విద్య, అనంతరం ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో చదివి, బందరు నోబుల్ కళాశాలో ఇంటర్మీడియట్, గుంటూరు ఎ.సి. కాలేజీలో బి.ఎ.పూర్తి చేశారు 1930లో దేశస్వాతంత్ర్యం కోసం పోరాటం సాగించిన నాటి తరం నేతలతో కలిసి పనిచేసి అనుభవా? పంచుకున్నారు. ఆనాడు కాంగ్రెస్ నాయకత్వం ఉద్యమాన్ని తాత్కాలికంగా రద్దు చేయటంతో అసంతృప్తి చెందిన బసవ పున్నయ్య భారతదేశ ప్రజ సమస్య సోషలిస్టు వ్యవస్థలో మాత్రమే పరిష్కారం కాగవన్న విశ్వాసంతో 1934 –35లో కమ్యూనిస్టు పార్టీలో చేరారు. గుంటూరులో జరిగిన విద్యార్థుల సమ్మెకు నాయకత్వం వహించి, సహ విద్యార్థులైన వై.వి.కృష్ణారావు, మాద నారాయణ స్వామి, మోటూరు హనుమంత రావు, లావు బాగంగాధర రావుతో కసి రాష్ట్రంలో బలమైన విద్యార్థి ఉద్యమాన్ని నిర్మించి, 1938లో ఆంధ్రరాష్ట్ర విద్యార్థి ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శిగా, అదే సమయంలో అఖిల భారత విద్యార్థి ఫెడరేషన్ సహాయ కార్యదర్శిగా పనిచేశారు. 1940లో గుంటూరు జిల్లా పార్టీ కార్యదర్శిగా బాధ్యతను స్వీకరించారు. 1943లో పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుగా ఎన్నికైనారు.1948లో కలకత్తాలో జరిగిన సి.పి.ఐ. ద్వితీయ మహాసభలో కేంద్ర కమిటికి ఎన్నికయ్యారు. 1964లో పార్టీ చీలిన తరువాత సి.పి.ఐ.(ఎం) పొలిట్‌బ్యూరోకు ఎన్నికయ్యారు. ఆ స్థానంలో నాలుగు దశాబ్దాల పాటు తుదిశ్వాస విడిచే వరకూ కొనసాగారు. మార్క్సిజం లెనినిజంకు చివరి వరకు కట్టుబడి ఉండి పీడిత ప్రజ విముక్తి కోసం విశిష్టమైన సేవందించారు. నిర్దిష్ట పరిస్థితుల్లో నిర్దిష్ట విశ్లేషణను చేయగలిగిన మార్క్సిజం లెనినిజం అనే సజీవ సిద్ధాంత వ్యాప్తికి, భారతదేశ ప్రజ విముక్తికి గణనీయమైన సేవలందించారు. తెలంగాణ పోరాటంలో ప్రముఖ పాత్ర వహించిన నాయకులో కామ్రేడ్ మాకినేని ఒకరు. తెంగాణా సాయుధ పోరాటంలో కామ్రేడ్స్ సుందరయ్య, చంద్ర రాజేశ్వరరావు మొదలైన ప్రముఖులతో పాటు కీలక పాత్రను పున్నయ్య పోషించారు. తెలంగాణ పోరాట నిర్వహణకు అవసరమైన నిధుల సమీకరణ, ఆయుధాల కోనుగోలు, చేరవేతలో ప్రధాన భాధ్యత బసవ పున్నయ్యదే. సాయుధ పోరాటాన్ని విరమించి విప్లవ మార్గాన్ని చేపట్టటంలో సుందరయ్యతో పాటు బసవ పున్నయ్య సృజనాత్మక పాత్ర నిర్వహించారు. భారతదేశ కమ్యూనిస్టు ఉద్యమంలో అగ్రగణ్యులైన నాయకులో ఒకరుగా ఎదిగారు. రహస్య జీవనం సాగించిన సందర్భం, ప్రభుత్వం దమన కాండకు ఎదురొడ్డి నిలిచి పోరాడిన అనుభవాల సాయంతో భారత దేశంలో విప్లవ సాధనకు అనుసరించాల్సిన వ్యూహం, ఎత్తుగడపై ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీలో చర్చను ప్రారంభించిన వారిలో ఒకరిగా, సిపిఎం విప్లవకర వ్యూహ్యాన్ని చేపట్టడంలో కామ్రేడ్ బసవ పున్నయ్య కీలక పాత్రధారి. భారత కమ్యూనిస్టు ఉద్యమంలో సిద్ధాంత పరంగా తీవ్రస్థాయిలో చర్చ సాగిన కాలంలో ఈ అంశంపై అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమ నాయకులతో చర్చ జరిపే బాధ్యతను పార్టీ కేంద్రకమిటీ కామ్రేడ్ మాకినేనికి అప్పగించింది. మాస్కోలో 1957లో జరిగిన ప్రపంచ కమ్యూనిస్టు పార్టీ మహాసభల్లో పాల్గోనేందుకు వెళ్ళిన సి.పి.ఐ. ప్రతినిధి వర్గంలో ఆయన సభ్యులు. నాడు దేశంలోనూ, అంతర్జాతీయం గానూ కమ్యూనిస్టు ఉద్యమం ఎదుర్కొంటున్న సమస్యపై మావోసేటుంగ్ తోనూ, లీషావ్‌చి నాయకత్వంలో వచ్చిన చైనా కమ్యూనిస్టు పార్టీ ప్రతినిధి బృందంతోనూ చర్చజరిపే అవకాశం కామ్రేడ్ బసవ పున్నయ్యకు వచ్చింది. శాస్త్రీయమైన, విప్లవకర మార్క్సిజం లెనినిజం సిద్ధాంతం పట్ల ప్రగాఢమైన నిబద్ధతతో కూడిన దేశభక్తి కామ్రేడ్ బసవ పున్నయ్యలో నిండుగా ఉంది. భారత విప్లవ మార్గానికి స్వతంత్ర వ్యూహాలను, ఎత్తుగడలను అన్వేషించి ప్రజలకు విప్లవ మార్గాన్ని సూచించారు. విప్లవ సాధనకు వ్యూహాన్ని రూపొందించేవారు. భారత దేశంలో పీడిత ప్రజల విముక్తి కోసం సైద్ధాంతికంగా, ఆచరణాత్మకంగా గణనీయమైన కృషి చేస్తూనే పార్లమెంటేరియన్ గానూ రాణించారు. రాజ్యసభ సభ్యుడిగా 1952 నుంచి 1966 వరకు 14 ఏళ్లు కొనసాగారు. కామ్రేడ్ మాకినేని బసవ పున్నయ్య రాజకీయ జీవితంలో ఆరేళ్లపాటు అజ్ఞాతవాసం సాగించారు. చైనా భారత్ యుద్ధం సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఆయన్ను రెండుసార్లు జైల్లో పెట్టింది. ఈ . చైనా భారత దేశాల మధ్య వివాదాన్ని సంప్రదింపులు, చర్చల ద్వారా మాత్రమే పరిష్కరించు కోవాలని, ఘర్షణ ద్వారా కాదని నొక్కి చెప్పారు. సి.పి.ఐ.(ఎం) ఆవిర్భావం నాటి నుంచి చనిపోయే వరకూ పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుగా పనిచేసిన కామ్రేడ్ మాకినేని పూర్వపు సోషలిస్టు దేశాల్లో సంభవించిన మార్పుకు సంబంధించి చేసిన సిద్ధాంత పరమైన సూత్రీకరణల్లో క్రియాశీక పాత్ర నిర్వహించారు. 1990లో సోవియట్ యూనియన్ కుప్పకూలి, సోషలిస్టు సిద్ధాంతం పైనే దాడి కేంద్రీకరించ బడినా సడలని కమ్యూనిస్టు విశ్వాసాన్ని నిలిపిన ధీరుడు బసవ పున్నయ్య. సి.పి.ఐ.(ఎం) అధికార పత్రిక పీపుల్స్ డెమొక్రసీ ఎడిటర్‌గా ఆయన 14 ఏళ్లు పనిచేశారు. సి.పి.ఐ.(ఎం) అభివృద్ధికి, దేశంలో కమ్యూనిస్టు ఉద్యమ అభివృద్ధికి వయసుతో నిమిత్తం లేకుండా అవిశ్రాంతంగా కృషిచేశారు. మాకినేని నిరంతరం చదివేవారు, విస్తృతంగా రాసేవారు. కార్యకర్తలు, ఢిల్లీ కార్యాలయం సిబ్బంది సంక్షేమం, వారి సమస్యల పరిష్కారం కోసం పనిచేసేవారు. అందుకే ఆయన్ను అందరూ ఎంతో అభిమానించే వారు. జాతీయ, అంతర్జాతీయ సమస్యలు సైద్ధాంతిక, వ్యక్తిగత సమస్యపై చర్చించేందుకు అయన అందరికీ ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేవారు. బసవ పున్నయ్య గొప్ప ఉపన్యాసకులు. సునిశితమైన రచయితగా అనేక సిద్ధాంత పత్రాలను రచించారు. ఆయనలో మార్క్సిస్టు లెనినిస్టు సిద్ధాత పరిజ్ఞానంతో పాటు అంతర్జాతీయత, దేశభక్తి, తెలుగు జాతీయత కలగలిపి ఉండేవి. విప్లవోద్యమం కోసం కామ్రేడ్స్ సుందరయ్య, రాజేశ్వర రావు మున్నగు వారితో సహా, తమ వ్యక్తిగత ఆస్తులను అమ్మి పార్టీకి ఇచ్చినవారిలో కామ్రేడ్ బసవ పున్నయ్య ఒకరు. కామ్రేడ్ బసవ పున్నయ్య ఢిల్లీలోని పార్టీ కేంద్ర కార్యాయంలో పార్టీ పనిలో ఉంటూనే 1992 ఏప్రిల్ 12వతేది సాయంత్రం అకస్మాత్తుగా మరణించారు.

# అంతరిక్షయానంలో ఇండియా రికార్డుల వెల్లువ

అంతరిక్ష విజ్ఞాన రంగంలో భారత్ సాధిస్తున్న ప్రగతి కేవలం ప్రయోగాలకు పరిమితం కాకుండా, ప్రపంచ యవనికపై ఒక అగ్రగామి శక్తిగా మన దేశాన్ని నిలబెడుతోంది. ఏప్రిల్ 12 "అంతర్జాతీయ మానవ అంతరిక్ష యాత్ర దినోత్సవం" సందర్భంగా, మానవాళి సాధించిన అద్భుతాలను గుర్తుచేసుకుంటూనే, భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ ప్రయాణాన్ని, దాని వెనుక ఉన్న కృషిని విశ్లేషించుకోవడం సముచితం. 1961 ఏప్రిల్ 12న సోవియట్ యూనియన్‌కు చెందిన యూరీ గగారిన్ 'వోస్టోక్-1' నౌకలో భూకక్ష్యలోకి ప్రవేశించి, అంతరిక్షంలోకి వెళ్ళిన తొలి మానవుడిగా చరిత్ర సృష్టించారు. ఈ చారిత్రాత్మక ఘట్టానికి 50 ఏళ్లు నిండిన సందర్భంగా, 2011లో ఐక్యరాజ్య సమితి ఏప్రిల్ 12ను అంతర్జాతీయ మానవ అంతరిక్ష యాత్ర దినోత్సవంగా ప్రకటించింది. ఈ నేపథ్యం ప్రపంచానికి ఒక ఎత్తయితే, భారత్ సున్నా నుండి శిఖరానికి చేరుకున్న వైనం మరో అద్భుత చరిత్ర. భారత అంతరిక్ష పితామహుడు డాక్టర్ విక్రమ్ సారాభాయ్ దూరదృష్టి నేడు భారత్‌ను అంతరిక్ష దిగ్గజంగా మార్చింది. 1957లో రష్యా 'స్పుత్నిక్' ప్రయోగించినప్పుడు, అంతరిక్ష పరిజ్ఞానం కేవలం విలాసం కాదని, దేశాభివృద్ధికి అదొక అవసరమని సారాభాయ్ గుర్తించారు. హోమీ బాభా సహకారంతో 1962లో 'ఇన్కోస్పార్' (ఎఔఅూఖంఫీ) ఏర్పాటు కావడం, కేరళలోని తుంబాలో ఒక చర్చి ప్రాంగణంలో రాకెట్ ప్రయోగాలు మొదలుపెట్టడం భారత అంతరిక్ష గాథలో అత్యంత స్ఫూర్తిదాయకమైన ఘట్టాలు. సైకిళ్లపై రాకెట్ విడిభాగాలను, ఎడ్ల బండ్లపై ఉపగ్రహాలను తీసుకెళ్లిన రోజుల నుండి నేడు ప్రపంచ దేశాల ఉపగ్రహాలను అతి తక్కువ ఖర్చుతో కక్ష్యలోకి చేర్చే స్థాయికి మనం ఎదిగాం. 1975 ఏప్రిల్ 19న మన తొలి ఉపగ్రహం 'ఆర్యభట్ట'ను సోవియట్ యూనియన్ సహాయంతో ప్రయోగించిన భారత్ ప్రపంచ రికార్డులను సృష్టిస్తోంది.

భారత అంతరిక్ష రంగంలో విప్లవాత్మక మార్పులు తెచ్చిన వ్యవస్థలలో 'ఇన్‌శాట్' (ఎఔాు) శ్రేణి ప్రధానమైనది. 1983లో ప్రారంభమైన ఈ వ్యవస్థ ఆసియా-పసిఫిక్ ప్రాంతంలోనే అతిపెద్ద సమాచార ఉపగ్రహ వ్యవస్థగా ఎదిగింది. ప్రస్తుతం వందలాది ట్రాన్స్‌పాండర్ల సహాయంతో టెలివిజన్ ప్రసారాలు, రేడియో నెట్‌వర్క్, వాతావరణ హెచ్చరికలు, విపత్తు నిర్వహణ వంటి సేవలను అందిస్తోంది. హస్సన్ (కర్ణాటక), భోపాల్ (మధ్యప్రదేశ్) కేంద్రాల నుండి ఈ ఉపగ్రహాలను నిరంతరం పర్యవేక్షిస్తుంటారు. అంతరిక్ష ప్రయోగాలపై పెట్టే ఖర్చు వృధా అని భావించే వారికి ఇస్రో సాధించిన విజయాలే సమాధానం. ఉదాహరణకు, అమెరికా వంటి దేశాలు అంగారక యాత్ర (ఓూఓ) కోసం వేల కోట్లు ఖర్చు చేస్తే, భారత్ కేవలం 450 కోట్ల రూపాయలతో (సుమారు 74 మిలియన్ డాలర్లు), హాలీవుడ్ సినిమా నిర్మాణ వ్యయం కంటే తక్కువతో మొదటి ప్రయత్నంలోనే విజయం సాధించి ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచింది. ప్రస్తుతం భారత్ వద్ద మూడు ప్రధాన ప్రయోగ కేంద్రాలు ఉన్నాయి. తుంబా (కేరళ)లో రాకెట్ విడిభాగాల తయారీ మరియు వాతావరణ రాకెట్ల ప్రయోగాలు జరుగుతుంటే, శ్రీహరికోట (ఆంధ్రప్రదేశ్) లోని 'సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం' ప్రధాన ప్రయోగ వేదికగా నిలుస్తోంది. ఇక్కడ ఉన్న రెండు లాంచ్ ప్యాడ్ల ద్వారా ఏడాదికి పలు ఉపగ్రహాలను ప్రయోగించే సామర్థ్యం మనకుంది. ఒరిస్సాలోని బలేశ్వర్ కేంద్రం ప్రధానంగా క్షిపణి పరీక్షలకు వేదికగా ఉంది. ఇస్రో చరిత్రలో మైలురాళ్లుగా నిలిచిన సంఘటనలు అనేకం. 2017లో పి.ఎస్.ఎల్.వి-సి37 ద్వారా ఒకేసారి 104 ఉపగ్రహాలను ప్రయోగించి భారత్ ప్రపంచ రికార్డు సృష్టించింది. ఇందులో 96 ఉపగ్రహాలు అమెరికావే కావడం విశేషం. ఇది భారత వాహక నౌకల విశ్వసనీయతకు మరియు తక్కువ వ్యయానికి నిదర్శనం. ఇటీవలి కాలంలో అంతరిక్ష రంగంలో ప్రైవేటు భాగస్వామ్యాన్ని ప్రోత్సహిస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పెను మార్పులకు నాంది పలికింది. 'ఇన్-స్పేస్' (ఎఔ-ాఖంఅవ) వంటి సంస్థల ద్వారా ప్రైవేటు స్టార్టప్‌లు అంతరిక్ష రంగంలోకి అడుగుపెట్టాయి. దీనివల్ల ఆర్థిక లావాదేవీలు పెరగడమే కాకుండా, సాంకేతికతలో వినూత్న ఆవిష్కరణలు చోటు చేసుకుంటున్నాయి. గత దశాబ్ద కాలంలో భారత్ 34 దేశాలకు చెందిన సుమారు 393 ఉపగ్రహాలను వాణిజ్యపరంగా ప్రయోగించి భారీ విదేశీ మారక ద్రవ్యాన్ని ఆర్జించింది. అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్, జపాన్ వంటి అగ్రదేశాలు సైతం నేడు ఇస్రో సేవలను వినియోగించుకుంటున్నాయంటే మన ప్రాముఖ్యత ఎంత పెరిగిందో అర్థం చేసుకోవచ్చు.

2023వ సంవత్సరం భారత అంతరిక్ష చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగ్గది. 'చంద్రయాన్-3' మిషన్ ద్వారా చంద్రుని దక్షిణ ధ్రువంపై సాఫ్ట్ ల్యాండింగ్ చేసిన మొదటి దేశంగా భారత్ అవతరించింది. దీని వెనుక శాస్త్రవేత్తల దశాబ్దాల కఠోర శ్రమ దాగి ఉంది. కేవలం చంద్రుడికే పరిమితం కాకుండా, సూర్యుడిపై అధ్యయనం కోసం 'ఆదిత్య-ఎల్1'ను విజయవంతంగా ప్రయోగించాం. రానున్న రోజుల్లో 'గగన్ యాన్' ద్వారా భారతీయులను అంతరిక్షంలోకి పంపే బృహత్తర కార్యక్రమం సిద్ధమవుతోంది. ఇది విజయవంతమైతే, అమెరికా, రష్యా, చైనా తర్వాత సొంతంగా మానవ అంతరిక్ష యాత్ర చేపట్టిన నాలుగో దేశంగా భారత్ నిలుస్తుంది. ముగింపుగా చూస్తే, అంతరిక్షం అనేది కేవలం నక్షత్రాల అన్వేషణ మాత్రమే కాదు, అది దేశ భద్రత, ఆర్థికాభివృద్ధి మరియు సాంకేతిక సార్వభౌమాధికారానికి నిదర్శనం. విక్రమ్ సారాభాయ్ వేసిన పునాది, అబ్దుల్ కలాం అందించిన క్షిపణి పరిజ్ఞానం, సతీష్ ధావన్ నేతృత్వంలో జరిగిన అభివృద్ధి నేడు సోమనాథ్ వంటి నాయకత్వంలో శిఖరాగ్రానికి చేరుతోంది. అంతర్జాతీయ మానవ అంతరిక్ష యాత్ర దినోత్సవం జరుపుకుంటున్న ఈ తరుణంలో, భారత్ తనదైన ముద్రను విశ్వవ్యాప్తంగా వేస్తూ, 'వసుధైక కుటుంబకం' స్ఫూర్తితో అంతరిక్ష ఫలాలను సామాన్య మానవుడికి సైతం చేరువ చేస్తోంది. రాబోయే కాలంలో అంతరిక్ష పర్యాటకం, అంతరిక్ష స్టేషన్ నిర్మాణం వంటి రంగాల్లోనూ భారత్ అగ్రగామిగా నిలవడం ఖాయంగా కనిపిస్తోంది.

# పంటకొనుగోళ్లలో తీవ్ర నిర్లక్ష్యం

- సిద్దిపేట యార్డులో రైతుల ఆందోళన
- సందర్శించిన ఎమ్మెల్యే హరీష్ రావు



**సిద్దిపేట, ఏప్రిల్ 11:** పంట కొనుగోలు చేయకుండా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నిరక్ష్యం వహిస్తోందని మాజీ మంత్రి, సిద్దిపేట బిఆర్ఎస్ ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ ప్రభుత్వ అలసత్వంతో రైతులు ఇబ్బంది పడుతున్నారని ఆగ్రహించారు. శనివారం సిద్దిపేట వ్యవసాయ మార్కెట్ యార్డ్‌ని హరీశ్‌రావు సందర్శించారు. పొద్దు తిరుగుడు, మొక్కజొన్న ధాన్యాన్ని నాలుగు రోజుల నుంచి కొనుగోలు చేయడం లేదని హరీశ్‌రావుకి రైతులు విన్నవించారు. అన్నదాతల సమస్యలు విని అధికారులతో ఫోన్‌లో మాట్లాడి వెంటనే సమస్య పరిష్కరించాలని ఆదేశించారు. ఫూలే జయంతీ సందర్భంగా రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. రైతుల పట్ల కాంగ్రెస్ సర్కార్ చిన్నచూపు చూపుతోందని ధ్వజమెత్తారు. నారాయణఖేడ్, ఆదిలాబాద్, నిజామాబాద్ కేంద్రాల్లో మొక్కజొన్న కొనుగోలు సెంటర్‌లను ఎందుకు ప్రారంభించలేదని ప్రశ్నించారు. వెంటనే కొనుగోలు సెంటర్‌లు ప్రారంభించి మద్దతు ధర ఇవ్వాలని డిమాండ్ చేశారు. మార్కెట్ యార్డ్‌లను అధికారులు సందర్శించాలని అన్నారు. చాలా చోట్ల కొనుగోలు సెంటర్‌లు ప్రారంభించకపోవడంతో తక్కువ ధరకు అమ్ముకుని రైతులు నష్టపోతున్నారని చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డి పంట మార్పిడి చేయమని చెబుతున్నారు.. కానీ రైతులు పంట మార్పిడి చేస్తే వాటిని కొనే దిక్కు లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను ఇబ్బంది పెడుతోందని ÷ర్ అయ్యారు. పలు జిల్లాల్లో వడగళ్ల వర్షాల వల్ల పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రైతులకు సమయానికి రైతు బంధు ఇవ్వాలని కోరారు. బీసీలను రేవంత్‌రెడ్డి ప్రభుత్వం దగా చేసిందని దుయ్యబట్టారు. బీసీ డిక్లరేషన్ పేరుతో రేవంత్‌రెడ్డి బీసీలను మోసం చేశారని ఆగ్రహించారు. కేసీఆర్ హయాంలో అన్ని కుల వృత్తులను ప్రోత్సహించామని చెప్పుకొచ్చారు. బీసీ విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే కాంగ్రెస్ ప్రభుత్వం విడుదల చేయాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

# అక్షరాస్యతలో వెనుకబడిన తెలంగాణ

- విద్యా రంగం పూర్తిగా అస్తవ్యస్తం
- ఫూలే ఆశయాలకు కాంగ్రెస్ తూట్లు
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్




**హైదరాబాద్, ఏప్రిల్ 11:** ప్రముఖ సామాజిక తత్వవేత్త, ఉద్యమకారుడు మహాత్మా జ్యోతిరావు పూలే ద్విశతాబ్ది జయంతి సందర్భంగా కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఘనంగా నివాళులర్పించారు. అణచివేతపై తిరుగుబాటుకు కేరాఫ్ అడ్రస్.. బడుగు, బలహీన వర్గాలకు కొండంత ధైర్యం.. మహాత్మా జ్యోతిరావు పూలే అని వ్యాఖ్యానించారు. ఈ మేరకు బండి సంజయ్ ఓ ప్రకటన విడుదల చేశారు. ఏ సమాజమైతే చదువు పరంగా, ఆర్థికంగా ఎదుగుతుందో అప్పుడే ఆ సమాజం అభివృద్ధి చెందుతుందని ఆశించిడమే కాకుండా అందుకోసం చివరిదాకా కృషి చేసిన మహనీయుడు ఫూలే అని కొనియాడారు. ఛత్రపతి శివాజీ మహారాజ్‌ను అభిమానించే జ్యోతిరావు ఫూలే కుల వివక్షపై అలుపెరగని పోరాటం చేశారని కీర్తించారు. ఆ రోజుల్లోనే వితంతు పునర్వివాహాలు జరపడంతోపాటు బాల్యవివాహాలకు వ్యతిరేకంగా ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చారని ప్రశంసించారు. మహిళల చదువు కోసం నిరంతరం పాటుపడ్డారని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం జ్యోతిరావు ఫూలే ఆశయాలకు, స్ఫూర్తికి భిన్నంగా పాలన కొనసాగిస్తోందని బండి సంజయ్ అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న విద్యాశాఖ పనితీరు దారుణంగా ఉందని తెలిపారు. అక్షరాస్యతలో జాతీయ సగటు కంటే తెలంగాణ పూర్తిగా వెనుకబడి ఉండటం ఆందోళన కలిగిస్తోందని చెప్పారు. ఏళ్ల తరబడి ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకపోవడంతో లక్షలాది మంది పేద, మధ్యతరగతి ప్రజలు ఉన్నత చదువులకు దూరమవుతున్నారని చెప్పుకొచ్చారు. ఆరోగ్య శ్రీ బకాయిలు ఏళ్ల తరబడి చెల్లించకపోవడంతో కార్పొరేట్, ప్రైవేట్ ఆస్పత్రులు ఆరోగ్య శ్రీ కార్డుపై చికిత్స చేయించుకోలేని దుస్థితి ఏర్పడిందని తెలిపారు. ప్రభుత్వ భూములను ఎడాపెడా అమ్ముతూ భవిష్యత్తు తరాలకు గజం జాగా కూడా లేకుండా కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తోందన్నారు. ఇకనైనా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఫూలే ఆశయాలను మాటల్లో కాకుండా చేతల్లో చూపాలని బండి సంజయ్ కోరారు. ఫూలే దీనబంధు అనే పత్రికను స్థాపించి బీదల, కార్మికుల సమస్యలను సమాజానికి తెలిసేలా చేశారని బండి సంజయ్ కుమార్ ప్రస్తావించారు. అట్టడుగు వర్గాల్లో విజ్ఞానాన్ని నింపడానికి, పేదలను ఆదుకోవడానికి సర్వస్వం త్యాగం చేసిన మహోన్నతుడు ఫూలే అని చెప్పారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఫూలేను గురువుగా ప్రకటించుకున్నారంటే ఆయన గొప్పదనం ఏంటో అర్థమవుతుందని అన్నారు. సతీమణి సావిత్రీబాయి ఫూలేతో కలిసి విద్యా ఉద్యమాన్ని ప్రారంభించి ఏకంగా 52 పాఠశాలలను ప్రారంభించి వేలాది మంది పేదలకు అక్షరజా&ఝనాన్ని అందించిన మహనీయుడు జ్యోతిరావు ఫూలే అని కొనియాడారు. స్వాతంత్యం÷-ర రాని రోజుల్లోనే నిర్బంధాలను, అణిచివేతలను తట్టుకుంటూ అణగారిన వర్గాల ప్రజల జీవితాల్లో వెలుగులు తెచ్చేందుకు జ్యోతిరావు ఫూలే చేసిన కృషి చిరస్మరణీయమని కీర్తించారు.

# కొత్తతరం నాయకత్వం రావాలి

- అరాచక పాలన అంతానికి యువత ముందుకు రావాలి
- రాబోయేవి అసెంబ్లీ ఎన్నికలు కాదు.. కేసీఆర్ ఎన్నికలే
- అబద్ధపు హామీలతో రేవంత్ సర్కార్ డబ్బా
- ఇబ్రహీంపట్నం కార్యకర్తల సమావేశంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్



**హైదరాబాద్, ఏప్రిల్ 11:** ఈ అరాచక పాలనను అంతమొందించాలంటే కొత్తతరం నాయకత్వం రావాల్సిన అవసరం ఉందని,. రాబోయే రోజుల్లో ఎన్నికలు ఎప్పుడొచ్చినా అవి కేసీఆర్ ఎన్నికలుగానే ఉంటాయి.. అసెంబ్లీ ఎన్నికలు కాదు. కేసీఆర్ ఎన్నికలే ఈ రాష్ట్రంలో జరుగుతాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో కేటీఆర్ మాట్లాడుతూ.. కేసీఆర్ తిరిగి అధికారంలోకి వచ్చే ఎన్నికలే జరుగుతయని నాకు విశ్వాసం ఉందన్నారు. ఇది నా ఆలోచన కాదు.. రాష్ట్రంలో ఎవరినైనా అన్నా ఎట్లున్నది పరిస్థితి అని అడగండి. రైతన్నల బాధలు వర్ణనాతీతంగా ఉన్నాయి. నేను జగిత్యాలకు పోతే అక్కడ ఓ రైతు సోదరుడు కలిసిండు. అన్న ఎట్లున్నది పరిస్థితి అని అడిగిన. ఆ ఏముంది సార్ మూడు సార్లు రైతు బంధు ఎగ్గొట్టిండు. రూ.27 వేల కోట్లు మిగిలినయి. అందులో నుంచి 20 వేల కోట్లు ఇచ్చి రుణమాఫీ చేసినా అని డబ్బా కొట్టుకుంటున్నడు. మా పైసలు మాకే ఇచ్చి మిదికెల్లి బాకీ ఉన్నడు.. కానీ బయటకు మాత్రం రైతు బంధు ఎగ్గొట్టిన అని చెప్పడు. రుణమాఫీ చేసినా అని చెప్పి.. అది కూడా ఊరిలో చారానా మందికి చేసిండు. బారానా మందికి కాలేదు. అగో గట్లుంది పాలనా అని ఒకే ఒక్కమాటలో రైతన్న చెబుతున్నడని అంటూ ఎద్దేవా చేశారు. ఏ యువకుడినైనా అడగండి రెండు లక్షల ఉద్యోగాలని ఊరించి పెద్ద పెద్ద మాటలు చెప్పి చివరకు మోసం చేసి గద్దెనెక్కి.. ఇంతవరకు రెండున్నర సంవత్సరాల్లో 11 వేల ఉద్యోగాలు కూడా ఇవ్వలేదు. మహిళలకు స్కూటీలు, తులం బంగారం అన్నడు.. నెలకు రూ.2500 ఇస్తా అన్నడు.. అత్తకు రూ.4 వేలు, కోడలుకు రెండున్నర వేలు నోటికి ఎంతొస్తే అంత మాటలిచ్చి మహిళలను మోసం చేసిండు. కేసీఆర్ రాకముందు 200 పెన్షన్ వచ్చేది. కేసీఆర్ దాన్ని రూ.2 వేలు చేసిండు. నవంబర్‌లో అయితే రూ.2వేలు, డిసెంబర్‌లో అయితే 4 వేలు అని చెప్పిండు. ముసలోళ్లను కూడా మోసం చేసిండు. రెండు నెలలు ఇప్పటికీ పెన్షన్ ఎగ్గొట్టిండు. 28 నెలల్లో సాధించింది ఏమైనా ఉందంటే ఒకే ఒక్కటి ఢిల్లీకి పోవుడు. వచ్చుడు.. ఎక్కే విమానం.. పోయే విమానం తప్ప ఈ రాష్ట్రంలో చేసింది మాత్రం ఏమీ లేదన్నాడు. మీ ఎమ్మెల్యే గురించైతే నేను చెప్పే అవసరమే లేదు. ఆయన ఎట్లాంటోడో ఏమేం వసూళ్లు చేస్తడో నాకంటే బాగా మీకే తెలుసు. ఆఖరికి అరటి పండ్ల బండ్లను కూడా విడిచిపెట్టడట అని కేటీఆర్ ఎద్దేవా చేశారు. గట్లాంటోడి గురించి నేను మాట్లాడ కని.. ఒకటి మాత్రం పక్కా. మంచి రెడ్డి లాంటి మంచి నాయకుడిని కోల్పోవడం వల్ల ఆయనకేం నష్టం కాలేదు. ఆయన బాగానే ఉన్నడు.. కానీ నష్టపోయింది ఇబ్రహీం పట్నం ప్రజలు అని గుర్తు చేస్తున్నా. మంచి నాయకుడు కేసీఆర్‌ను కోల్పోయినం. ఇబ్రహీంపట్నంలో మంచి రెడ్డి కిషన్ రెడ్డి లాంటి మంచి నాయకుడిని పోగోట్టుకున్నం. అందుకే ఈ ప్రభుత్వం చేస్తున్న అరాచకలు నా కంటే బాగా మీకే తెలుసనన్నారు కేటీఆర్. కేసీఆర్ నాయకత్వంలో 14 వేల ఎకరాలు సేకరించి గ్రీన్ ఫార్మా సిటీ పెట్టాలని పట్టుబట్టామని అన్నారు. స్టేట్ ఆఫ్ ది ఆర్ట్.. అంటే ప్రపంచంలోనే అత్యున్నతమైన ప్రమాణాలతో స్థానికంగా కాలుష్యమనేది లేకుండా అక్కడే బాగా చేయాలనే ఉద్దేశంతో దాదాపు 7 సంవత్సరాలు కిషన్ రెడ్డి, సబితక్క, నేను కష్టపడి చాలా మందిని ఒప్పించి మెప్పించి కొంత ఇబ్బంది పెట్టి కూడా రైతులకు మొక్కాలే.. తద్లాండి 14 వేల ఎకరాలు సేకరించినమని చెప్పుకొచ్చారు. అయితే ఇప్పుడేం జరుగుతున్నదో చూస్తున్నామని అన్నారు.





## వర్ణ వివక్షపై పోరాటం ఆదర్శనీయం

### సామాజిక విప్లవకారుడు ఫూలేకు కేసీఆర్ నివాళి

**హైదరాబాద్, ఏప్రిల్ 11:** వర్ణ వివక్షకు వ్యతిరేకంగా జీవితాంతం పోరాడిన సామాజిక విప్లవకారుడు, సమ సమాజ స్థాపన మార్గదర్శి మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా ఆయన సేవలను బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ స్మరించుకున్నారు. భారత సమాజంలో వర్ణ, కుల, లింగ వివక్షను రూపుమాపి సామాజిక న్యాయం అందించిన దార్శనికుడు పూలే అని కొనియాడారు. సబ్బండ వర్ణాలు సామాజిక, ఆర్థిక రంగాల్లో ఎదగాలంటే విద్య ఒక్కటే మార్గమని పూలే చెప్పిన మాటలు ఎల్లప్పుడూ ఆచరణీయమని తెలిపారు. తన భార్య సావిత్రి బాయి పూలేకు చదువు నేర్పించి, మహిళా విద్య కోసం అనేక కష్టాలను ఎదుర్కొన్న గొప్ప సంకల్పం ఆయనదని ప్రశంసించారు. పూలే ఆశయాలకు అనుగుణంగానే గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల పాలనలో సబ్బండ కులాల అభ్యున్నతికి కృషి చేసిందని కేసీఆర్ గుర్తు చేశారు. సాగునీరు, విద్యుత్, రైతు బంధు, రైతు బీమా వంటి పథకాలతో వ్యవసాయ రంగాన్ని పటిష్టం చేశామన్నారు. గొర్రెల పెంపకం, చేపల పంపిణీ, నేతన్నకు చేయూత వంటి వృత్తి కులాల ప్రోత్సాహక పథకాలతో దళిత బహుజనులు ఆర్థికంగా నిలదొక్కుకున్నారని తెలిపారు. దీనివల్ల తెలంగాణ గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు పునరుజ్జీవం లభించిందని చెప్పారు. ఆసరా పెన్షన్లు, బీసీ బంధు వంటి పథకాలతో వెనుకబడిన కులాల అభివృద్ధికి బాటలు వేశామని పేర్కొన్నారు. బీసీ కులాల విద్య కోసం ప్రత్యేక రెసిడెన్షియల్ విద్యాసంస్థలు ఏర్పాటు చేసి అంతర్జాతీయ స్థాయి చదువును అందించామని కేసీఆర్ వివరించారు. రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో బీసీ కులాల ఆత్మగౌరవం నిలబడేలా అత్యంత విలువైన స్థలాలు, నిధులు కేటాయించి ఆత్మగౌరవ భవనాల నిర్మాణం చేపట్టామన్నారు. పూలే ఆశయాల మేరకు తాము ప్రారంభించిన ప్రగతి పథకాలను ప్రస్తుత ప్రభుత్వం కూడా చిత్తశుద్ధితో కొనసాగించాలని సూచించారు. అప్పుడే మహాత్మా పూలేకు నిజమైన నివాళి అర్పించినట్లు అవుతుందని కేసీఆర్ స్పష్టం చేశారు.

## 20న మోతెలో భారీ బహిరంగ సభ

### సభాస్థలిని పరిశీలించిన బీఆర్ఎస్ నేతలు

**జగిత్యాల, ఏప్రిల్ 11:** జగిత్యాల జిల్లా మోతెలో ఈ నెల 20వ తేదీన బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ భారీ బహిరంగ సభ జరగనుంది. ఈ సందర్భంగా సభాస్థలిని పార్టీ జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్‌రావు, ఎమ్మెల్యే కల్వంకుట్ల సంజయ్, మాజీ మంత్రులు కొప్పుల ఈశ్వర్, జీవన్ రెడ్డి, మాజీ జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత, తుల ఉమ పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యాసాగర్‌రావు మాట్లాడుతూ.. ఈ నెల 20న మోతెలో కేసీఆర్ భారీ బహిరంగ సభ ఉండబోతుందని తెలిపారు. లక్షకు పైగా జనాభాకు అనుగుణంగా సభాస్థలిని ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ.. ప్రజాభీష్టం మేరకే జీవన్ రెడ్డి బీఆర్ఎస్‌లో చేరారని తెలిపారు. కాంగ్రెస్ పాలనలో రెండున్నరేళ్లలో తెలంగాణ అస్తవ్యస్తమైందని విమర్శించారు. కేసీఆర్ పాలన రావాలని ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. జీవన్ రెడ్డి ఏనాడూ అధికారం కోసం పాకులాడలేదని కల్వకుంట్ల సంజయ్ అన్నారు. బీఆర్ఎస్ చేసిన అభివృద్ధిని గుర్తించిన ఆయన బీఆర్ఎస్‌లో చేరారని తెలిపారు. స్థానిక ప్రజలు, కార్యకర్తల అభిప్రాయంతోనే బీఆర్ఎస్‌లోకి జీవన్ రెడ్డి వచ్చారని పేర్కొన్నారు. జీవన్ రెడ్డి మార్గదర్శనం, సూచనలతో ముందుకెళ్తామని స్పష్టం చేశారు.

## గజ్వేల్ రింగ్ రోడ్డు పనులు పూర్తి చేయండి

### పెండింగ్ పనులు పరిశీలించిన బీజేపీ మెదక్ ఎంపీ రఘునందన్

**సిద్దిపేట, ఏప్రిల్ 11:** గజ్వేల్ అభివృద్ధికి ఈ రింగ్ రోడ్డు కీలకమైనదని.. నిలిచిపోయిన పనులను వెంటనే పూర్తి చేసేలా సీఎం రేవంత్‌రెడ్డి చర్యలు తీసుకోవాలని బీజేపీ మెదక్ ఎంపీ రఘునందన్‌రావు తెలిపారు. శనివారం గజ్వేల్ పట్టణంలో అసంపూర్తిగా ఉన్న రింగ్ రోడ్డును రఘునందన్ రావు పరిశీలించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవల నర్మెట్టకు వచ్చినప్పుడు అసంపూర్తిగా ఉన్నా గజ్వేల్ రింగ్ రోడ్డు వ్యవహారం గురించి వివరించానని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి సమస్యను తీసుకెళ్లినప్పుడు పరిష్కరిస్తామని సభ వేదికగా చెప్పారని ప్రస్తావించారు. రింగ్ రోడ్డు పూర్తి కావడానికి 151 మీటర్ల భూ సేకరణ పెండింగ్‌లో ఉందని వెల్లడించారు. ఒక రైతుని పిలిచి ఒప్పించడంలో జిల్లా రెవెన్యూ యంత్రాంగం అంతా కూడా నిర్లక్ష్యంగా ఉన్నారని మండిపడ్డారు. రింగ్ రోడ్డు వ్యవహారంలో సమస్య ఎక్కడ ఉందో తెలుసుకోవడానికి తానే స్వయంగా వచ్చి పరిశీలించానని తెలిపారు. జిల్లా ఎంపీగా భూమి ఇచ్చే రైతుతో మాట్లాడి ఈ పనులపై చొరవ తీసుకుంటానని అన్నారు. ఒక వేళ రైతు భూమి ఇచ్చే వ్యవహారంలో అంగీకరించని పక్షంలో చట్టప్రకారం చర్యలు తీసుకునే విధంగా కృషి చేస్తానని ఎంపీ రఘునందన్ రావు పేర్కొన్నారు.

## 13 నుంచి 18 వరకు అరైవ్-అలైవ్ కార్యక్రమం

### ప్రజాపాలనలో రోడ్డు భద్రతపై చైతన్యం : డీజీపీ శివధర్ రెడ్డి

**హైదరాబాద్, ఏప్రిల్ 11:** రోడ్డు ప్రమాదాలు నివారణ చర్యల్లో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా అరైవ్-అలైవ్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి వ్యాఖ్యానించారు. ప్రభుత్వంలో ఉన్న అన్ని శాఖల సమన్వయంతో పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. ప్రజా పాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా ఈనెల 13వ తేదీ నుంచి 18వ తేదీ వరకు అరైవ్-అలైవ్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ప్రపంచ వ్యాప్తంగా ఎక్కువ రోడ్డు ప్రమాదాలు మన దేశంలోనే జరుగుతున్నాయని, ద్విచక్ర వాహనదారులు, పాదచారులు, రోడ్డు వెంట ఉన్న వారు ఎక్కువ సంఖ్యలో మృతిచెందుతున్నారని తెలిపారు.ప్రజా సంక్షేమం, భద్రతే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం వివిధ కార్యక్రమాలు అమలుచేస్తోందని అన్నారు. గ్రామాల్లో ఉన్న ఎంపీటీసీలు, సర్పంచ్‌ల నుంచి సీఎం వరకు ఈ కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లాలని తెలంగాణ ప్రభుత్వం ఆదేశించినట్లు డీజీపీ తెలిపారు. ప్రతి గ్రామంలో రోడ్ సేఫ్టీ కమిటీని 8 నుంచి 9 మందితో ఏర్పాటు చేయాలని, దానిలో విరమణ పొందిన ఉద్యోగులు, మహిళలు, స్వచ్ఛంద సంస్థల బాధ్యులు ఉండేలా చూడాలని సూచించారు. ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డీజీపీ శివధర్ రెడ్డి పిలుపునిచ్చారు



# హానికరమైన అవపాతాలు

మనుషులు, మొక్కలు, జలచరాలు తదితర జీవులతో పాటు నేలలు, కట్టడాలపైనా ఆమ్లవర్షాలు హానికరమైన ప్రభావాన్ని చూపుతున్నాయి. సల్ఫర్ డయాక్సైడ్, నైట్రోజన్ డయాక్సైడ్ ఉద్గారాలతో వాతావరణంలోని నీటి బిందువులు కలుషితమై వర్షం, మంచు, పొగమంచు, పొడి ధూళి రూపంలో భూమిపై పడుతోంది. వాతావరణంలోని కాలుష్య కారకాలకు తోడు శిలాజ ఇంధనాల దహనంతో తలెత్తుతున్న ఈ పరిస్థితులకు ప్రభావాలు, పర్యవసానాలు, నియంత్రణ చర్యల గురించి పోటీ పరీక్షార్థులకు పరిజ్ఞానం ఉండాలి. ఆమ్ల వర్షాలు ప్రపంచవ్యాప్తంగా సృష్టించిన అనర్థాలు, పర్యావరణ వ్యవస్థలతో పాటు మనుషుల ఆరోగ్యంపై కలిగిస్తున్న దుష్ప్రభావాలపై అవగాహన పెంపొందించుకోవాలి.

నీటి ద్రావణానికి ఉండే ఆమ్లత్వం లేదా క్షారత్వాన్ని కొలవడానికి పీహెచ్ స్కేలు ఉపయోగిస్తారు. 1909లో సోరెన్‌సన్ అనే డానిష్ శాస్త్రవేత్త ఈ స్కేలును కనిపెట్టారు. ఇందులో '0' (బలమైన ఆమ్లం) నుంచి 14 (బలమైన ఆల్కలీన్) వరకు రీడింగ్ ఉంటుంది. స్కేలులో పాయింట్ 7 తటస్థతను సూచిస్తుంది.

**ఆమ్ల వర్షాలు**

అన్ని రకాల ఆమ్ల అవపాతాలను వివరించడానికి ఉపయోగించే విస్తృత పదం 'ఆమ్ల వర్షం (యాసిడ్ రెయిన్)'..వాతావరణ కాలుష్య కారకాలైన సల్ఫర్, నత్రజని ఆక్సైడ్‌లు సల్ఫ్యూరిక్, నైట్రిక్ ఆమ్లాలుగా మారినప్పుడు అవపాతం మరింత ఆమ్లంగా మారుతుంది. ఆమ్ల నిక్షేపణ, ఆమ్ల వర్షం, ఆమ్ల అవపాతం తదితరాలన్నీ వాయు కాలుష్య రూపాలే. 'యాసిడ్ రెయిన్' అనే పదాన్ని మొదటగా 1870లో రాబర్ట్ అంగస్ స్మిత్ అనే శాస్త్రవేత్త ఇంగ్లండ్‌లోని మాంచెస్టర్ నగరంలో ఉపయోగించారు. ఆమ్లవర్షం సమస్య కొత్తదేమీ కాదు. కానీ సమస్య స్వభావం పట్టణాలు, నగరాలకు విస్తరించడంతో అంతర్జాతీయ సమస్యగా మారింది. స్మిత్ కాలంలో పట్టణాలు, నగరాల్లో ఆమ్లవర్షం కురిసింది. ప్రస్తుతం వాతావరణంలోకి కాలుష్యాన్ని వెదజల్లే పొడవైన చిమ్నీలను ప్రవేశపెట్టడంతో కాలుష్య కారకాలు వేల కిలోమీటర్లు రవాణా అవుతున్నాయి.

**ఆమ్ల కాలుష్య కారకాల మూలాలు:** వాతావరణంలో కార్బన్ డయాక్సైడ్ వల్ల అవపాతం సహజంగా ఆమ్ల స్వభావంతో ఉంటుంది. శిలాజ ఇంధనాలను మండించడం వల్ల సల్ఫర్ డయాక్సైడ్, నైట్రోజన్ ఆక్సైడ్ ఉత్పత్తి అవుతాయి. ఇవి అవపాతం ఆమ్ల గుణాన్ని పెంచుతాయి. సల్ఫర్ డయాక్సైడ్, నత్రజని ఆక్సైడ్‌ల ఉత్పత్తి, అగ్ని పర్వతాలు, మహాసముద్రాలు, జీవక్షయం, అడవుల్లో మంటలు మొదలైనవి ఆమ్ల కాలుష్యానికి సహజ కారణాలు. వాటితోపాటు దహన వనరులు కూడా కారకాలే.ఇటీవలి దశాబ్దాల్లో విద్యుత్తు డిమాండ్, మోటారు వాహనాల సంఖ్య పెరగడంతో ఆమ్లీకరణ కాలుష్య కారకాలు, ఉద్గారాలు విపరీతంగా పెరిగాయి. 1950 తర్వాత వచ్చిన పరిణామాలతో కాలుష్య కారక ఉద్గారాలు ఉత్తరార్ధ గోళంలో, ముఖ్యంగా ఐరోపా, ఉత్తర అమెరికాల్లో కేంద్రీకృతమయ్యాయి. దీంతో ఆ దేశాల్లో అవపాతం ఆమ్ల స్వభావాన్ని సంతరించుకుంది. 1970, 1980లో స్కాండినేవియన్ దేశాలు చెట్లు, మంచినీటిపై ఆమ్ల ప్రభావాలను గుర్తించాయి. దానికి కారణమైన కాలుష్యాల్లో ఎక్కువ భాగం ఇతర దేశాల నుంచి రవాణా అయినవే అని గ్రహించారు. దీంతో ఆమ్ల వర్షం అంతర్జాతీయ ఆందోళనగా మారింది.

**ఆమ్ల వర్షం ప్రభావాలు**

**చేప జాతులకు ముప్పు**

ఆమ్ల వర్షం కారణంగా జర్మనీ, ఇతర ఐరోపా దేశాల్లోని అనేక నీటివనరుల పీహెచ్ విలువ ఐదు కంటే తక్కువగా ఉంటుంది. ఈ ఆమ్ల స్థాయి అనేక చేప జాతులకు ప్రాణాంతకం. ఆమ్ల నీరు మట్టి నుంచి అల్యూమినియాన్ని విడుదల చేస్తుంది. ఇది ప్రవాహాల్లో కలిసి నీటి వనరుల్లోకి చేరుతుంది. ఆల్కలీన్ లేదా న్యూట్రల్ సరస్సుల్లో రాళ్లు, మట్టి, సెడిమెంట్లలో అల్యూమినియం సాంద్రత తక్కువగా ఉంటుంది. పీహెచ్ తగ్గినప్పుడు గతంలో కరగని అల్యూమినియం నీటి ద్రావణంలోకి వెళుతుంది. దాంతో చేపలకు ఆక్సిజన్ సరఫరా తగ్గిపోతుంది.


**భౌగోళిక పర్యావరణ వ్యవస్థపై ప్రభావం**

1) కిరణజన్య సంయోగక్రియ, పెరుగుదల రేటు తగ్గుతుంది.
2) కరవు, వ్యాధులకు సున్నితంగా మారుతుంది.
3) బీన్స్, ముల్లంగి, పాలకూర లాంటి వివిధ రకాల పంటల్లో ఎదుగుదల మందగిస్తుంది.
4) నైట్రోజన్ ఫిక్సింగ్ బ్యాక్టీరియా కార్యకలాపాలు తీవ్రంగా ప్రభావితమవుతాయి. ఇది చివరికి నైట్రోజన్ వలయానికి ఆటంకం కలిగిస్తుంది.
5) స్ప్రూస్, పైన్ బూడిద, బిర్చ్ మొదలైన చెట్లు ఆమ్ల నిక్షేపణకు ఎక్కువగా గురవుతాయి.



**సరస్సు పర్యావరణ వ్యవస్థపై ప్రభావం**

అమెరికా, కెనడా, నార్వే తదితర దేశాల్లో వేలాది సరస్సులు ఆమ్లత్వం వల్ల నిరుపయోగంగా మారాయి. ఇందులో ఫైటోప్లాంక్టన్ తక్కువ స్థాయిలో ఉంటుంది. పెంకులున్న నత్తలు, క్లామ్స్, ఇతర జంతువులు ఆమ్ల నీటిలో సులభంగా కరిగిపోతాయి. వీటితో పాటు చేపలూ మరణిస్తాయి. డ్రాగన్ ఫ్లై లార్వా, వాటర్ బోట్ మ్యాన్ లాంటి కొన్ని కీటకాలు ఆమ్ల సరస్సుల్లో ఆహార గొలుసు పైభాగంలో ఉన్న చేపల స్థానాన్ని భర్తీ చేస్తాయి. నీటి మొక్కలు చనిపోతాయి. సరస్సు నాచుతో నిండిపోయి, ఇతర సూక్ష్మజీవులూ నశిస్తాయి.




**నిర్మాణ సామగ్రి నష్టం**

ఆమ్ల వర్షంతో రంగులు, స్టీల్, ప్లాస్టిక్ తదితర భవన నిర్మాణ సామగ్రితో పాటు పాలరాయి, సున్నపురాయి మొదలైన వాటికి నష్టం జరుగుతుంది. వాతావరణంలో పెరిగిన ఆమ్లత వల్లే తాజ్‌మహల్ సహజ సౌందర్యం మసకబారుతోంది. దీనికి 40 కిలోమీటర్ల దూరంలో చమురుశుద్ధి కర్మాగారం ఏర్పాటు చేయడమే ఇందుకు కారణం.

**మానవాళికి రోగాలు**

వాతావరణ ఆమ్లత్వం దీర్ఘకాలిక శ్వాసకోశ సమస్యలను కలిగిస్తుంది. రాగి, కాడ్మియం, జింక్, పాదరసం తదితర భార లోహాలు ఆమ్ల వర్షం ద్వారా నేల, శిలల నుంచి విడుదలవుతాయి. ఇవి ఆహార గొలుసులోని మొక్కలు, జంతువుల ద్వారా లేదా తాగునీటి రూపంలో మనుషుల శరీరంలోకి చేరతాయి. వాహనాల్లో ఇంధనం మండినప్పుడు వాయు కాలుష్య కారకాలు ఉత్పత్తి అవుతాయి. యూఎస్, జపాన్ 1970ల్లో మోటారు వాహనాల ఉద్గారాలను నియంత్రించడానికి కఠినమైన ప్రమాణాలను ప్రవేశపెట్టాయి.వాహన ఉద్గారాలు ప్రత్యక్షంగా, పరోక్షంగా మనుషుల ఆరోగ్యానికి ప్రమాదకరం. వాటి ప్రభావంతో రక్తానికి ఆక్సిజన్ మోసే సామర్థ్యం క్షీణించడంతోపాటు, శ్వాస సమస్యలు ఏర్పడతాయి. ఉత్ప్రేరక కన్వర్టర్ల వాడకంతో వాహనాల ఉద్గారాలను తగ్గించవచ్చు.

**పరిష్కార మార్గాలు**

**పారిశ్రామిక ఉద్గారాల నియంత్రణ:** అనేక పారిశ్రామిక వనరుల్లో దహన ప్రక్రియల కారణంగా సల్ఫర్ డయాక్సైడ్, నైట్రోజన్ ఆక్సైడ్‌ల ఆమ్ల ఉద్గారాలు ఉత్పన్నమవుతాయి. వాటిని తగ్గించడానికి పలు సాంకేతికతలు అందుబాటులో ఉన్నాయి. వాటిని దహనానికి ముందు, దహన సమయంలో లేదా తర్వాత ఉపయోగించవచ్చు.

**ప్రత్యామ్నాయ ఇంధనాలు:** కొన్ని ఇంధనాలు సహజంగానే ఆమ్ల ఉద్గారాల పరంగా తక్కువ కాలుష్యాన్ని ఉత్పత్తి చేస్తాయి. కాల్చే బొగ్గులో ఉన్న సల్ఫర్ పరిమాణం ఆధారంగా కాలుష్యం పెరుగుతుంది. థర్మల్ కేంద్రాల్లో తక్కువ సల్ఫర్ ఉండే శిలాజ ఇంధనాల వినియోగాన్ని ప్రోత్సహించడం, జల, పవన విద్యుత్తు, అలల విద్యుత్తు లాంటి ప్రత్యామ్నాయ ఇంధన వనరులను ఉపయోగించుకోవడం మొదలైన చర్యలు కాలుష్యాన్ని తగ్గిస్తాయి. డీ-సల్ఫరైజేషన్ ప్రక్రియ వినియోగం, ఇంజిన్లలో మార్పులు తదితర పద్ధతులు కూడా మేలు చేస్తాయి.

ఆమ్ల జలాల్లో హేచరీ చేపలు: ఆమ్లీకరించిన సరస్సుల్లో పర్యావరణ సమతౌల్యత నిర్వహణకు ఈ విధానాన్ని చేపడతారు. చేపల సంఖ్య మరింత క్షీణించకుండా ఈ పద్ధతి ఉపయోగపడుతుంది. భూమి క్షీణతతో భారత వ్యవసాయ ఉత్పత్తిలో 11%-26% వరకు నష్టపోతుండగా, ఆమ్ల వర్షాలు మరింత పెంచుతున్నాయి.

# బిట్ కాయిన్ బబుల్ పేలనుందా.?

ప్రపంచంలోనే అతిపెద్ద క్రిప్టోకరెన్సీ అయిన బిట్‌కాయిన్ గత కొన్ని సంవత్సరాలుగా భారీగా ప్రాచుర్యం పొందింది. పెట్టుబడుల కోసం, అంతర్జాతీయ లావాదేవీల కోసం చాలా మంది దీనిని ఉపయోగిస్తున్నారు. అయితే ఇటీవల బిట్‌కాయిన్ భవిష్యత్తుపై కొన్ని కొత్త ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా క్వాంటమ్ టెక్నాలజీ అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో క్రిప్టో భద్రతపై చర్చ మొదలైంది. బిట్‌కాయిన్ ధరలో తరచూ మార్పులు కనిపిస్తున్నాయి. ప్రపంచ రాజకీయ పరిస్థితులు, ఆర్థిక పరిస్థితులు కూడా దీనిపై ప్రభావం చూపుతున్నాయి. చాలామంది ఈ మార్పులను తాత్కాలికంగా భావిస్తున్నప్పటికీ, కొందరు నిపుణులు మాత్రం భవిష్యత్తులో పెద్ద సాంకేతిక మార్పులు వస్తే బిట్‌కాయిన్ విలువపై ప్రభావం పడే అవకాశం ఉందని చెబుతున్నారు. దీంతో పెట్టుబడిదారుల్లో కొంత అనిశ్చితి కనిపిస్తోంది. ఇటీవల గూగుల్ క్వాంటమ్ ఏఐ చేసిన ఒక అధ్యయనంలో క్రిప్టోకరెన్సీల భద్రతపై ఆసక్తికర విషయాలు వెల్లడయ్యాయి. కొన్ని సిస్టమ్‌లను "క్వాంటమ్ రిజిస్టెంట్" అని భావిస్తున్నప్పటికీ, బిట్‌కాయిన్ విషయంలో ఇంకా పూర్తిగా భద్రత ఉందని చెప్పలేమని నిపుణులు పేర్కొన్నారు. క్వాంటమ్ కంప్యూటింగ్ టెక్నాలజీ మరింత అభివృద్ధి చెందితే బిట్‌కాయిన్ సెక్యూరిటీపై ప్రభావం పడే అవకాశం ఉందని చెబుతున్నారు. ఇప్పటివరకు బిట్‌కాయిన్ భద్రతను చెరిపేయడానికి లక్షల సంఖ్యలో క్వాంటమ్ క్యూబిట్స్ అవసరం అవుతాయని భావించేవారు. అయితే తాజా నివేదికల ప్రకారం ఆ సంఖ్య ఇప్పుడు గత అంచనాల కంటే చాలా తగ్గిందని తెలుస్తోంది. అయితే ప్రస్తుతం అలాంటి శక్తివంతమైన క్వాంటమ్ కంప్యూటర్ ఇంకా



తయారు కాలేదు. అయినప్పటికీ భవిష్యత్తులో టెక్నాలజీ వేగంగా అభివృద్ధి చెందితే ఈ అంశంపై జాగ్రత్తలు అవసరం అవుతాయని నిపుణులు చెబుతున్నారు. క్వాంటమ్ టెక్నాలజీ మరింత అభివృద్ధి చెందితే క్రిప్టో ట్రాన్సాక్షన్ల సమయంలో కొత్త రకమైన ప్రమాదాలు ఏర్పడే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఉదాహరణకు, ఒక వ్యక్తి బిట్‌కాయిన్ పంపుతున్న సమయంలో ట్రాన్సాక్షన్ పూర్తికాకముందే దానిలో జోక్యం చేసి మోసాలకు పాల్పడే అవకాశం ఉంటుందని చెబుతున్నారు. అందుకే భవిష్యత్తులో క్రిప్టో రంగంలో మరింత బలమైన భద్రతా వ్యవస్థలు అవసరమని సూచిస్తున్నారు.

# 2.22 లక్షల పన్ను వివాదాల పరిష్కారం




పన్ను చెల్లింపుదారుల వివాదాలను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు ఆదాయపు పన్ను విభాగం వేగంగా అడుగులు వేస్తోంది. గత ఆర్థిక సంవత్సరంలో 2,22,540 అప్పీళ్లను పరిష్కరించినట్లు కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు (సీబీడీటీ) పేర్కొంది. 2024-25లో పరిష్కరించిన వివాదాలతో పోలిస్తే, ఈ సంఖ్య 29% అధికమని సీబీడీటీ ఛైర్మన్ రవి అగర్వాల్ తెలిపారు. ఆదాయపు పన్ను సిబ్బందికి ఆయన రాసిన లేఖలో గత ఆర్థిక సంవత్సరంలో సాధించిన సమష్టి విజయాలను కొనియాడారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2026-27)లోనూ పారదర్శక - సమర్థ పన్నుల వ్యవస్థను అందించడమే లక్ష్యంగా పనిచేయాలని అధికారులకు సూచించారు. పన్ను ఎగవేతలకు అడ్డుకట్ట వేసేందుకు గణాంకాల విశ్లేషణ, నిఘా ఆధారిత విధానాలను పటిష్టం చేసినట్లు వివరించారు. తప్పుడు మినహాయింపుల క్లెయిములు, వ్యాపార ఆదాయాలను తగ్గించి చూపించడం వంటివి అరికట్టేందుకు, దేశవ్యాప్తంగా అంశాల ఆధారంగా దర్యాప్తులు చేపట్టినట్లు వివరించారు. డిజిటల్ రికార్డుల్లోకి స్వచ్ఛంద సంస్థలు: ధార్మిక సంస్థలు, మినహాయింపుల విభాగం కింద గత ఆర్థిక సంవత్సరంలో 1.56 లక్షల ట్రస్టులకు రిజిస్ట్రేషన్లు, పునరుద్ధరణలు కల్పించినట్లు సీబీడీటీ ఛైర్మన్ తెలిపారు. కాగితాలకే పరిమితమైన ఈ సంస్థల రికార్డులను ఐటీ శాఖ డిజిటల్ రూపంలోకి మార్చింది. 2026 ఐటీ విభాగానికి ఎంతో కీలకమని రవి అగర్వాల్ స్పష్టం చేశారు. నూతన ఆదాయపు పన్ను చట్టం-2025 అమల్లోకి రావడమే ఇందుకు కారణమన్నారు.

# గంట తర్వాతే 10వేలు జమ.. యూపీఐ లావాదేవీల్లో ఆర్బీఐ కొత్త రూల్స్?




యూపీఐ సేవలు.. భారతీయ ఆర్థిక రంగ ముఖచిత్రాన్నే మార్చేశాయి. రోజూ కోట్లాది లావాదేవీలు అలవోకగా జరిగిపోతున్నాయిప్పుడు. అయితే అంతే స్థాయిలో ఆన్‌లైన్ మోసాలూ పెరిగిపోతున్నాయి. అక్రమార్కుల దెబ్బకు అమాయకులు పెద్ద ఎత్తున నష్టపోతున్నదీ చూస్తూనే ఉన్నాం. నిజానికి బ్యాంక్ ఖాతాదారులు ఈ కేటుగాళ్ల బారినపడకుండా ఆర్బీఐ ఎప్పటికప్పుడు అనేక రకాల నిర్ణయాలను, చర్యలను తీసుకుంటున్నది. ఈ క్రమంలోనే ఓ కొత్త ప్రతిపాదనను చేసినట్టు సమాచారం. రూ.10,000, ఆపై నగదు మొత్తాలను గూగుల్‌పే, ఫోన్‌పే తదితర యూపీఐ వేదికల ద్వారా పంపినప్పుడు.. అది రిసీవర్ ఖాతాలో క్రెడిట్ అవ్వాలంటే గంట సమయం పట్టేలా రూల్స్‌ను మార్చాలని చూస్తున్నది. కానీ సెండర్ అకౌంట్ నుంచి వెంటనే సదరు మొత్తం డెబిట్ అయినట్టు చూపిస్తుంది. అయినప్పటికీ ఒకవేళ ఏవైనా పొరపాట్లు జరిగినా, ఒకరికి బదులుగా మరొకరికి పంపించామనుకున్నా, పంపినవారు సదరు

లావాదేవీని వద్దని భావించినా లేదా మోసపోయామని గుర్తించినా.. ఆ సొమ్ము బ్యాంకర్ల సహకారంతో తిరిగి వారి ఖాతాలోకే వచ్చేలా నిబంధనల్ని మార్చాలని ఆర్బీఐ చూస్తున్నదని చెప్తున్నారు. మరోవైపు బ్యాంకులు సైతం ఈ గంట సమయంలో క్రాస్ చెక్ చేసుకోవడానికి సమయం ఉంటుందని, లావాదేవీ అసాధారణంగా కనిపించినా, ఓ కొత్త ఖాతాలోకి భారీ మొత్తం వెళ్తున్నా.. ఖాతాదారులను అలర్ట్ చేయవచ్చన్న అభిప్రాయాలూ వ్యక్తమవుతున్నాయి.

# స్విగ్గీ నుంచి వైదొలిగిన నందన్ రెడ్డి

ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేస్తే, ఆహారాన్ని సరఫరా చేసే ప్లాట్‌ఫామ్ స్విగ్గీ నుంచి మరో సహవ్యవస్థాపకుడు నందన్ రెడ్డి వైదొలగనున్నారు. శ్రీహర్ష మాజేటి, రాహుల్ జైమిని, నందన్ రెడ్డి కలిసి 2014 ఆగస్టులో ఈ సంస్థను స్థాపించారు. 2020లో కంపెనీ నుంచి రాహుల్ జైమిని తప్పుకుని, పెస్టో టెక్ పేరుతో సొంతంగా కంపెనీని ప్రారంభించారు. ఇప్పుడు నందన్ కూడా అదేబాట పట్టారు. సొంతంగా కొత్త అంకుర సంస్థను అభివృద్ధి చేయడం పైనే ఎక్కువ సమయం వెచ్చించాలని నందన్‌రరెడ్డి అనుకుంటున్నారని సంబంధిత వర్గాలు చెబుతున్నాయి. స్విగ్గీ గ్రూపు సీఈఓగా మరో సహవ్యవస్థాపకుడు శ్రీహర్ష మాజేటి వ్యవహరిస్తున్నారు. స్విగ్గీలో 20 శాతానికి పైగా వాటాతో అతిపెద్ద వాటాదారుగా ఉన్న ప్రోసస్ తన నామినీ డైరెక్టర్లలో మార్పులు చేయనుంది. రోజర్ క్లార్క్ రబాలియస్ నామినీ డైరెక్టరు పదవికి రాజీనామా చేస్తారు. ఈ స్థానాన్ని రెనాన్ డె కాస్ట్రో ఆల్వెస్ పింటో భర్తీ చేస్తారు. బోర్డు సభ్యుల సంఖ్యను పెంచే యోచనలోనూ స్విగ్గీ ఉంది. 2015లో స్విగ్గీలో

చేరి, వైస్‌ప్రెసిడెంట్‌గా కార్యకలాపాలు నిర్వహించిన ఫణి కిషన్ అద్దేపల్లిని 2021 జులైలో కంపెనీ సహవ్యవస్థాపకుడిగా పదోన్నతి కల్పించారు. ప్రస్తుతం చీఫ్ గ్రోత్ ఆఫీసర్‌గా వ్యవహరిస్తున్న ఫణి కిషన్, ముఖ్య ఆర్థిక అధికారి రాహుల్ బోత్రా స్విగ్గీ బోర్డులో చేరనున్నారు. ఈ నిర్ణయానికి వాటాదార్లు అనుమతి ఇవ్వాల్సి ఉంటుంది.



## అదానీ బిడ్‌పై వేదాంత సవాల్




జైప్రకాష్ అసోసియేట్స్ లిమిటెడ్ (జెఎఎల్) దివాలా పరిష్కార ప్రక్రియ (ఐబిసి)లో భాగంగా అదానీ ఎంటర్‌ప్రైజెస్ బిడ్‌ను ఎంపిక చేయడాన్ని మైనింగ్ దిగ్గజం వేదాంత గ్రూప్ ఎన్‌సిఎల్‌టిలో సవాలు చేసింది. అదానీ సమర్పించిన రూ.14,535 కోట్ల బిడ్ కంటే తమ ఆఫర్ స్థూల విలువ రూ.3,400 కోట్లు, నికర విలువలో రూ.500 కోట్లు ఎక్కువగా ఉన్నప్పటికీ రుణదాతల కమిటీ తక్కువ ధరకే మొగ్గు చూపడంపై వేదాంత తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. రుణదాతలు అనుసరించిన మూల్యాంకన పద్ధతులు పారదర్శకంగా లేవని.. ఆస్తుల విలువను గరిష్టం చేయాలనే దివాలా చట్టం ప్రధాన లక్ష్యాన్ని పక్కన పెట్టి అసంబద్ధమైన స్కోరింగ్ పద్ధతులతో తమను తప్పించారని వేదాంత తరపు న్యాయవాది వాదించారు. మరోవైపు రుణదాతల కమిటీ తమ నిర్ణయాన్ని సమర్థించుకుంటూ మొత్తం ప్రక్రియ ఐబిసి నిబంధనల ప్రకారమే జరిగిందని స్పష్టం చేసింది. కేవలం అత్యధిక ధర కోట్ చేసినంత మాత్రాన బిడ్ దక్కదని.. నగదు లభ్యత, ప్రాజెక్టును అమలు చేయగల సామర్థ్యం వంటి అనేక అంశాలను పరిగణనలోకి తీసుకున్నామని తెలిపింది. దాదాపు రూ.57,185 కోట్ల అప్పుల్లో ఉన్న జెఎఎల్ గ్రూప్‌నకు నోయిడాలో విలువైన రియల్ ఎస్టేట్ ప్రాజెక్టులు, సిమెంట్ ప్లాంట్లు, హోటళ్లు ఉన్నాయి. ప్రస్తుతం ఈ వ్యవహారం ఎన్‌సిఎల్‌టిలో విచారణలో ఉండగా తుది తీర్పు వచ్చే వరకు ఈ కొనుగోలు ప్రక్రియ ట్రిబ్యునల్ పరిధిలోనే కొనసాగుతుందని ఆ వర్గాలు తెలిపాయి.

## క్లీన్ ఎనర్జీలో విస్తృతావకాశాలు



ప్రముఖ పారిశ్రామికవేత్తల అసోసియేషన్ ఫిక్కీ నెట్ జీరో ఫోరం సదస్సులో భారత క్లీన్ ఎనర్జీ లక్ష్యాలపై విస్తృతంగా చర్చించారు. శుక్రవారం హైదరాబాద్‌లో జరిగిన భారత్ 150 గిగావాట్ సౌర విద్యుత్ సామర్థ్యంతో ప్రపంచంలోనే మూడో స్థానానికి చేరిందని, రాబోయే నాలుగేండ్లలో ఈ రంగం 51 లక్షల గ్రీన్ జాబ్స్‌ను సృష్టిస్తుందని కేంద్ర పునరుత్పాదక శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి తెలిపారు. ఈ రంగంలో విస్తృతావకాశాలు ఉన్నాయ న్నారు. మొత్తం విద్యుత్ సామర్థ్యంలో సుమారు 50-55 శాతం పునరుత్పాదక శక్తి వనరుల నుంచే వస్తోం దన్నారు. ఫిక్కీ నెట్ జీరో ఫోరం పెట్టుబడులు ఆకర్షించడంలో, భాగస్వామ్యాలను పెంపొం దించ డంలో కీలక పాత్ర పోషిస్తుందని ఆయన అన్నారు. సోలార్ వాహనాల వల్ల ప్రయాణ ఖర్చు కిలో మీటరుకు కేవలం 60 పైసలకు తగ్గుతుందని తెలంగాణ ఇంధన శాఖ కార్యదర్శి నవీన్ మిట్టల్ వివరించారు. పర్యావరణ హిత ఇంధన వనరుల దిశగా భారత్ వేగంగా అడుగులు వేస్తోందని ఈ సదస్సు స్పష్టం చేసింది.

## ఓలా ఎలక్ట్రిక్ షేర్ల నెలలోనే 71% లాభం





ఒకప్పుడు ఎలక్ట్రిక్ టూ-వీలర్ మార్కెట్‌లో రారాజుగా వెలిగి, ఆ తర్వాత వరుస ఎదురుదెబ్బలతో కుదేలైన ఓలా ఎలక్ట్రిక్ మళ్ళీ ఫామ్‌లోకి వచ్చింది. గత ఆరు నెలలుగా నష్టాల ఊబిలో కూరుకుపోయిన ఈ షేరు, ఇప్పుడు రాకెట్‌లా దూసుకెళ్తోంది. కేవలం ఈ ఏప్రిల్ నెలలోనే 71 శాతం లాభపడి ఇన్వెస్టర్లకు బంపర్ ప్రాఫిట్స్ అందిస్తోంది. గత ఏడాది కాలంగా ఓలా ఎలక్ట్రిక్ షేరు భారీ ఒడిదుడుకులను ఎదుర్కొంది. కస్టమర్ల అసంతృప్తి, సర్వీస్ సమస్యలు, పోటీ పెరగడం వంటి కారణాలతో షేరు ధర భారీగా పడిపోయి ఒకానొక దశలో రూ. 21.25 (52 వారాల కనిష్ఠం) వద్దకు చేరుకుంది. అయితే, ఈ ఏప్రిల్ నెలలో సీన్ రివర్స్ అయింది. ఇవాళ ఒక్కరోజే 12.55 శాతం జంప్ చేసి రూ. 40.90 వద్ద ముగిసింది. మార్చి నెలలో కంపెనీ అమ్మకాలు ఊహించని రీతిలో పెరగడం ఇన్వెస్టర్లలో నమ్మకాన్ని పెంచింది. కస్టమర్ల ఫిర్యాదులను సీరియస్‌గా తీసుకున్న కంపెనీ, సర్వీస్ సెంటర్ల నాణ్యతను పెంచడంపై దృష్టి సారించింది. బెంగళూరు కేంద్రంగా నడుస్తున్న ఫ్యూచర్ ఫ్యాక్టరీ ద్వారా సొంతంగా బ్యాటరీ ప్యాక్స్ తయారు చేయడం కంపెనీకి పెద్ద ప్లస్ పాయింట్‌గా మారింది. ఈవీ రంగంలో ఇతర కంపెనీల కంటే ముందుండేలా టెక్నాలజీపై ఓలా పెడుతున్న పెట్టుబడులు ఫలితాలను ఇస్తున్నాయి. ఓలా ఎలక్ట్రిక్ ప్రస్తుతం సుమారు రూ. 18,030 కోట్ల మార్కెట్ విలువను కలిగి ఉంది. గత వారం రోజుల్లోనే 35 శాతం మేర లాభపడినప్పటికీ, గత రెండేళ్ల కాలంలో ఈ స్టాక్ ఇంకా 57 శాతం నష్టంలోనే ఉంది. ప్రస్తుత ర్యాలీ ఇలాగే కొనసాగితే త్వరలోనే తన 52 వారాల గరిష్ఠ ధర అయిన రూ. 71.25 దిశగా అడుగులు వేసే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.

వైష్ణవి చైతన్య టైమ్‌లెస్ ఎత్నిక్ లుక్‌లో గాంభీర్యాన్ని పునర్నిర్వచించింది



# దిశా పటానీ అందాలకు సోషల్ మీడియాలో క్రేజ్.. ఫ్యాన్స్ ఫిదా



బాలీవుడ్ హాట్ బ్యూటీ దిశా పటానీ తన గ్లామరస్ లుక్స్‌తో ఇంటర్నెట్‌ను షేక్ చేస్తోంది. తెలుగులో 'లోఫర్' సినిమాతో ఎంట్రీ ఇచ్చి, రీసెంట్‌గా 'కల్కి 2898 ఎడి'లో ప్రభాస్ సరసన మెరిసిన ఈ భామ, అటు సినిమాలతోనూ ఇటు హాట్ ఫోటోషూట్‌లతోనూ ఎప్పుడూ వార్తల్లో నిలుస్తోంది. తాజాగా దిశా పోస్ట్ చేసిన మైండ్ బ్లాక్ అయ్యే పిక్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో సెన్సేషన్ క్రియేట్ చేస్తున్నాయి. ఆమె అందచందాలకు నెటిజన్లు ఫిదా అవుతూ లైకులు, కామెంట్లతో హోరెత్తిస్తున్నారు. ఆ విశేషాలు చూద్దాం ..

**టాలీవుడ్ ఎంట్రీ నుండి పాన్ ఇండియా స్టార్ వరకు :**

వరుణ్ తేజ్ నటించిన 'లోఫర్' సినిమాతో దిశా పటానీ తెలుగు ప్రేక్షకులకు పరిచయమైంది. మొదటి సినిమాతోనే తన క్యూట్ అండ్ హాట్ లుక్స్‌తో కుర్రాళ్ల మనసు దోచుకుంది. ఆ తర్వాత బాలీవుడ్‌లో వరుస అవకాశాలు అందుకుంటూ స్టార్ హీరోయిన్‌గా ఎదిగింది. ఇక పాన్ ఇండియా రెబల్ స్టార్ ప్రభాస్ సరసన 'కల్కి 2898 ఎడి'లో నటించి మరోసారి టాలీవుడ్ వెండితెరపై మెరిసింది.ఇక సూర్య కంగువ మూవీ లో నటించి మెప్పించింది.ఇక గ్లోబల్ లెవల్ ప్రాజెక్టుల్లో భాగమవుతూ తన క్రేజ్‌ను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్తోంది.

**సోషల్ మీడియాలో గ్లామర్ విందు:**

దిశా పటానీకి సోషల్ మీడియాలో ఉన్న ఫాలోయింగ్ అంతా ఇంతా కాదు. ఎప్పటికప్పుడు తన ఫిట్‌నెస్ వీడియోలను, గ్లామరస్ ఫోటోలను షేర్ చేస్తూ ఫ్యాన్స్‌ను ఖుషీ చేస్తూ ఉంటుంది. తాజాగా ఆమె షేర్ చేసిన ఫోటోల్లో మెరిసే డ్రెస్ వేసుకుని, తన ఎద అందాలతో కుర్రాళ్లకు మెంటలెక్కించేలా స్టిల్స్ ఇచ్చింది. ఈ ఫోటోలు చూసిన వారెవరైనా దిశా అందానికి దాసోహం అనాల్సిందే. నెట్టింట మంటలు పుట్టించడంలో ఈమె రూటే సెపరేట్ అని నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు.

**బ్రాండ్ ఎండార్స్‌మెంట్స్.. స్పెషల్ షోలతో బిజీ:**

కేవలం సినిమాలే కాకుండా, దిశా పటానీ టాప్ బ్రాండ్లకు అంబాసిడర్‌గా వ్యవహరిస్తూ కోట్లు గడిస్తోంది. ఫిట్‌నెస్ ఫ్రీక్ కావడంతో స్పోర్ట్స్ వేర్ మరియు ఫ్యాషన్ బ్రాండ్ల ప్రకటనల్లో ఈమెకు డిమాండ్ ఎక్కువగా ఉంది. అలాగే పలు స్పెషల్ షోలు, ఈవెంట్లలో తన డాన్స్ పర్ఫార్మెన్స్‌తో స్టేజ్‌పై నిప్పులు చెరుగుతుంది. ఇక బాలీవుడ్ టాప్ హీరోల సినిమాల్లో నటిస్తూనే, మరోవైపు గ్లామర్ షోతో తన పాపులారిటీ తగ్గకుండా జాగ్రత్త పడుతోంది. మొత్తానికి దిశా పటానీ అటు వెండితెరపై, ఇటు సోషల్ మీడియాలోనూ తన హవా కొనసాగిస్తోంది. నటనతో పాటు తన పర్ఫెక్ట్ ఫిజిక్‌తో యూత్ ఐకాన్‌గా మారింది. ప్రస్తుతం చేతిలో మరిన్ని క్రేజీ ప్రాజెక్టులు ఉన్న ఈ భామ, రాబోయే రోజుల్లో ఇంకెన్ని రికార్డులు సృష్టిస్తుందో చూడాలి. ఇక ఏదేమైనా దిశా పటానీ అప్‌డేట్ వచ్చిందంటే చాలు, నెటిజన్లు ఆ ఫోటోలపై ఒక లుక్కేయకుండా ఉండలేరు. ఈ బాలీవుడ్ భామ అందాలకు ఫిదా అవ్వని వారుండరంటే అతిశయోక్తి కాదు!

# పల్లె బాట పట్టిన యంగ్ స్టార్స్!

త్రిధా చౌదరి నీలి రంగులో చక్కదనాన్ని పునర్నిర్వచించింది





ఓవైపు తెలుగు సినిమా పాన్ ఇండియాలో సంచలనం సృష్టిస్తుంటే మరికొంత మంది నవతరం మేకర్స్ గ్రామీణ నేపథ్యంగల సినిమాల ట్రెండ్ ను అంతకంతకు పెంచుతున్నారు. ఒకప్పుడు పల్లెటూరి కథలంటే కేవలం సెంటిమెంట్‌కే పరిమితం అనుకునేవారు. కానీ ఇప్పుడు అవే కథలు బాక్సాఫీస్ వద్ద కాసుల వర్షం కురిపిస్తున్నాయి. ఇటీవల విడుదలైన రాజు వెడ్స్ రాంబాయి ఘనవిజయం సాధించడం ఈ మార్పుకు నిదర్శనం. అంతకు ముందు రిలీజ్ అయిన బలగం గొప్ప చిత్రంగా నిలిచిన సంగతి తెలిసిందే. నేటి యువ తరం హీరోలు , దర్శకులు విదేశీ లోకేషన్ల కంటే పచ్చని పల్లెటూరి పొలాలనే తమ కథా వేదికలుగా ఎంచుకుంటున్నారు. ఈ క్రమంలోనే మాస్ మహారాజా రవితేజ తమ్ముడి కుమారుడు మాధవ్ భూపతిరాజు తన అదృష్టాన్ని పరీక్షించుకోవడానికి సిద్ధమయ్యారు. మాధవ్ నటిస్తోన్న మారెమ్మ చిత్రం తెలంగాణ గ్రామీణ నేపథ్యంతో రూపొందుతోంది. పూర్తి స్థాయి రా అండ్ రస్టిక్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ సినిమాపై ట్రేడ్ వర్గాల్లో మంచి అంచనాలు ఉన్నాయి. కొత్త హీరోలు తమను తాము నిరూపించుకోవడానికి ఇమేజ్ చట్రంలో ఇరుక్కోకుండా ఇలాంటి సహజసిద్ధమైన పాత్రలను ఎంచుకోవడం సానుకూల పరిణామం. మరోవైపు బలగం సినిమాతో పల్లెటూరి ఎమోషన్స్‌ను ప్రపంచవ్యాప్తంగా చాటిచెప్పిన దర్శకుడు వేణు ఎల్దండి తదుపరి చిత్రం ఎల్లమ్మ-పై దృష్టి సారించాడు. దేవి శ్రీ ప్రసాద్ హీరోగా నటిస్తోన్న ఈ సినిమా కూడా గ్రామీణ సంస్కృతి , ఆచారాల చుట్టూ తిరిగే కథతో వస్తోంది. -బలగం అందించిన స్ఫూర్తితో వేణు ఈసారి మరింత లోతైన భావోద్వేగాలను, పల్లెటూరి జీవన విధానాన్ని వెండితెరపై ఆవిష్కరించబోతున్నాడు. దేవిశ్రీ ప్రసాద్ సంగీతం ఈ చిత్రానికి అదనపు బలాన్ని ఇవ్వనుంది.యువ హీరో కిరణ్ అబ్బవరం సైతం తన పంథాను మార్చి గ్రామీణ కథల వైపు మొగ్గు చూపుతున్నాడు. ఆయన నటిస్తూ నిర్మిస్తోన్న చిత్రం తిమ్మరాజుపల్లి అనే చిత్రం ఏప్రిల్ 17న విడుదలవుతుంది. ఈ సినిమా పూర్తిగా రూరల్ సెటప్‌లో సాగే సస్పెన్స్ థ్రిల్లర్‌గా ఉండబోతోంది. కిరణ్ అబ్బవరం గత చిత్రాల్లో పల్లెటూరి అబ్బాయిగా మెప్పించి నప్పటికీ ఈ చిత్రం ఆయన కెరీర్‌లో విభిన్నమైన మలుపు కానుందని విశ్లేషకులు భావిస్తున్నారు. పల్లెల్లో ఉండే రాజకీయాలు , సామాజిక అంశాలను ఇందులో స్పృశించినట్లు తెలుస్తోంది.

గ్రామీణ చిత్రాలకు ఆదరణ పెరగడానికి ప్రధాన కారణం అందులో ఉండే సహజత్వం. నగర జీవితంలోని యాంత్రికతకు దూరంగా, స్వచ్ఛమైన అనుబంధాలు, పల్లెటూరి చిలిపి పనులు ,మట్టి మనుషుల కథలు ప్రేక్షకులకు త్వరగా కనెక్ట్ అవుతున్నాయి. బలగం, కేర్ ఆఫ్ కంచరపాలెం వంటి చిన్న చిత్రాలు పెద్ద విజయాలు సాధించడం చూసాక యంగ్ స్టార్స్ కూడా తమ కంఫర్ట్ జోన్ దాటి మరీ పల్లెటూరి వాతావరణంలోకి వెళ్తున్నారు. ఇది కంటెంట్ పరంగానే కాకుండా బడ్జెట్ పరంగా కూడా నిర్మాతలకు గిట్టుబాటు అయ్యే అంశం.ఆ రకంగా పల్లెటూరి కథల ట్రెండ్ టాలీవుడ్‌లో సరికొత్త ఊపిరి పోస్తోంది. భారీ గ్రాఫిక్స్ కంటే బలమైన కథలు, మట్టి వాసన ఉన్న పాత్రలే సినిమాను గట్టెక్కి స్తాయని యంగ్ స్టార్స్ నిరూపిస్తున్నారు. మాధవ్, వేణు, కిరణ్ అబ్బవరం వంటి వారు తీసుకొస్తున్న ఈ రూరల్ డ్రామాలు బాక్సాఫీస్ వద్ద ఎలాంటి ప్రభావాన్ని చూపుతాయో చూడాలి. ఏదేమైనా? తెలుగు సినిమా మళ్లీ రూట్స్ వెతుక్కుంటూ గ్రామాల వైపు వెళ్లడం శుభపరిణామంగా చెప్పొచ్చు.

Editor, Publisher & Owner by Reddy Shekar, 3-184, venkatapur, (m) venkatapur, mulugu dist, 506352, Printed at 16-48 SS Printers, (m) mulugu, mulugu. RNI No. TELTEL/2021/86151, E Mail : teenmaardesk@gmail.com, Cell : 9966847463